ANN తెలుగు

Follow: @ANNTELUGU

05-09-2025

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్   సంపుటి- 22   సంచిక- 272   పేజీలు-08   వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI   REGISTERED NUMBER: APTEL/2003/09316   WWW.EPAPER.MAHAADAILY.COM




ప్రత్యేక కథనం 4లో

టాప్ న్యూస్

## ముఖ్య అనుచరులతో కవిత భేటీ

- భవిష్యత్ కార్యాచరణపై వ్యూహరచన



02

## హ్యాపీ రావు లీలలు

- కవితక్క అప్‌డేట్స్
- పల్లెప్రగతిలో 120 కోట్ల అవినీతి
- సంతోష్ పై నేరెళ్ల బాధితుల ఫిర్యాదు



02

## గణేశ్ లడ్డూ రూ.51.77 లక్షలు

- మైహోం భుజలో రికార్డు
- లడ్డూ దక్కించుకున్న ఇల్లందుకు చెందిన కొండపల్లి గణేశ్

07






# అండగా ఉంటా.. ఆదుకుంటా

## కామారెడ్డిని కొడంగల్‌తో సమానంగా అభివృద్ధి చేస్తా..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా

### వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన.. బాధితులకు ధైర్యం

### ఇళ్ళు, పరిహారం పంపిణీకి తక్షణ ఆదేశాలు.. జిల్లా అధికారులతో సమీక్ష

**కామారెడ్డి, మహా :** అండగా ఉంటాం.. ఆదుకుంటాం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరదబాధితులకు భరోసానిచ్చారు. రాష్ట్రంలో ఇటీవల భారీ వర్షాలు, వరదల కారణంగా భారీగా నష్టపోయిన కామారెడ్డి జిల్లాలోని పలు ప్రాంతాలలో పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీతో కలిసి గురువారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వర్షాలు, వరదల వల్ల కామారెడ్డి జిల్లా అతలాకుతలమైంది. గ్రామాలు నీట మునగడంతో వందలాది కుటుంబాలు రోడ్ల పాలయ్యారు. పంటలు పూర్తిగా నాశనమయ్యాయి. ఈ పరిస్థితిని స్వయంగా పరిశీలించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డికి వెళ్లారు. తాడ్వాయి మండలంలోని ఎర్రపహాడ్ గ్రామానికి చేరుకున్న ఆయన వరద బాధితులను కలుసుకుని పరామర్శించారు. వరదల సమయంలో బలహీనంగా మారిన లింగంపల్లి కుర్దు ఆర్ అండ్ బి బ్రిడ్జిని సీఎం పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శనను కూడా ఆయన సందర్శించారు. ఇది కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకూడదని.. శాశ్వత పరిష్కారం కోసం పటిష్ట ప్రణాళికలు రూపొందించాలనే ఆదేశాలు అధికారులకు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.

మిగతా 2లో

# రేపు హైదరాబాద్‌కు హరీష్

## లండన్‌లో అంబేద్కర్ హౌస్‌ను సందర్శించిన మాజీ మంత్రి

### కవిత ఆరోపణల నేపథ్యంలో కేసీఆర్ కీలక సమావేశం

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ కీలక నేత, మాజీ మంత్రి హరీష్ లండన్ లో ఉన్న సమయంలో వరుస ప్రెస్ మీట్లతో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విరుచుకుపడగా, ఆమెను పార్టీ నుండి కూడా సస్పెండ్ చేశారు. లండన్ నుండి హరీష్ శనివారం తిరిగిరానుండగా, అదేరోజు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను కలవనున్నారు. కవిత హరీష్ పై తీవ్ర ఆరోపణలు చేయగా, సోషల్ మీడియాలో బీఆర్ఎస్ పార్టీ అంతా హరీష్ కు మద్దతుగా నిలిచారు. తాజా రాజకీయ పరిణామాలు, భవిష్యత్ కార్యాచరణపై కేసీఆర్ పార్టీ ముఖ్యులతో గురువారం చర్చించారు. మరోవైపు హరీష్ బాబాసాహెబ్ తన విద్యార్థి రోజుల్లో ఒకప్పుడు నివసించిన లండన్‌లోని అంబేద్కర్ హౌస్‌ను గురువారం సందర్శించారు. సమానత్వం, న్యాయం మరియు సాధికారత ప్రతిధ్వనించే చారిత్రాత్మక ప్రదేశంలో తన హృదయపూర్వక నివాళులు అర్పించినట్లు పేర్కొన్నారు. జైభీమ్ అంటూ హ్యాష్ ట్యాగ్ పెట్టారు. హరీష్ శనివారం తిరిగొచ్చాక రాజకీయాలు మరింత వేడెక్కే అవకాశాలున్నాయి.






## ఎస్ఎల్బీసీ పనులు ఆగొద్దు

- ఒక్క రోజు పనులు ఆలస్యం చేసినా ఒప్పుకోను
- గ్రీన్ ఛానల్‌లో నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం
- సొరంగం తొవ్వకంలో సింగరేణి నిపుణుల సేవలను వినియోగించుకోవాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- ఎస్ఎల్బీసీ పనులపై మంత్రి ఉత్తమ్, అధికారులతో సీఎం సమీక్ష

02




# ప్రజాదరణలో రేవంతే టాప్

## ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో కాంగ్రెస్ సర్కారే బెటర్

### కేసీఆర్ రీఎంట్రీ బలంగా ఉంటుంది.. యూరియా పాపం కేంద్రానిదే

### ఎఎన్ఎన్-మహా సర్వేలో పబ్లిక్ ఒపీనియన్

(హైదరాబాద్ -మహా)

ప్రజాదరణలో రేవంత్ కు తిరుగులేదని, తెలంగాణ ప్రజానాయకుడు.. ఫ్యూచర్ లీడర్ రేవంత్ రెడ్డేనని మెజారిటీ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ఎఎన్ఎన్ తెలుగు ఛానల్ మహా పత్రిక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనతో పాటు వివిధ అంశాలపై పోల్ నిర్వహించగా, 25వేల మందికి పైగా ఇందులో పాల్గొన్నారు. తెలంగాణలో పీపుల్స్ లీడర్ గా ఎవరిని భావిస్తున్నారన్న ప్రశ్నకు 48శాతం సీఎం రేవంత్ రెడ్డిని భావిస్తున్నట్లు చెప్పారు. తర్వాత 43శాతం కేసీఆర్, తర్వాత బండిసంజయ్ ని పేర్కొన్నారు. 25వేల మంది ఓటింగ్ లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రిగా తర్వాత కూడా రేవంత్ రెడ్డే ఉండాలని 58శాతం భావిస్తుండగా, 31 శాతం కేటీఆర్ కు మద్దతుగా ఈ పోల్ లో నిలిచారు. ఇక తెలంగాణ రాజకీయాల్లో కేసీఆర్ రీఎంట్రీ బలంగా ఉంటుందని ఎక్కువమంది అభిప్రాయపడ్డారు. 51శాతం మంది రీఎంట్రీ బలంగా ఉంటుందని, 43శాతం ఉండదని 6,700మంది అభిప్రాయాలు సేకరించగా.. చెప్పారు. యూరియా కొరతకు కేంద్రమే కారణమని 57శాతం మంది అభిప్రాయపడుతుండగా, 43 శాతం మంది రాష్ట్రానిదే తప్పన్నారు. తెలంగాణ ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వమే బెటర్ అని 54 శాతం, బీఆర్ఎస్ బెటర్ అని 30శాతం మంది చెప్పారు. వివిధ అంశాలపై సేకరించిన అభిప్రాయ సేకరణలో రేవంత్ పాపులారిటీ, పాలన పట్ల ఎక్కువమంది సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ పాలనలో తెలంగాణ ప్రపంచంతో పోటీ పడేవిధంగా అభివృద్ధి చెందుతుందని 62శాతం మంది అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని వీటి ద్వారా స్పష్టమవుతోంది.







# అండగా ఉంటా.. ఆదుకుంటా

## కామారెడ్డిని కొడంగల్‌తో సమానంగా అభివృద్ధి చేస్తా..

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భరోసా

### వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన.. బాధితులకు ధైర్యం

### ఇళ్ళు, పరిహారం పంపిణీకి తక్షణ ఆదేశాలు.. జిల్లా అధికారులతో సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు మళ్లీ రాకుండా ఉండేందుకు బ్రిడ్జ్ కమ్ బ్యారేజ్ లేదా బ్రిడ్జ్ కమ్ చెక్‌డ్యామ్ మాదిరి నిర్మాణాలు చేయగలమా అనే అంశంపై సవివరంగా అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. శాశ్వత ప్రణాళికలతోనే గ్రామీణ ప్రజలు భద్రతగా జీవించగలరని సీఎం అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం రైతులతో మాట్లాడిన ఆయనకు వారు తమ ఇబ్బందులను ఆవేదనతో వివరించారు. పొలాల్లో ఇసుక మట్టిపాలైపోయినట్లు, వరదల వల్ల పంటలు పూర్తిగా నాశనం అయ్యాయని, గృహాలు కూడా మునిగిపోయి జీవనోపాధి దెబ్బ తిన్నదని తెలిపారు. బాధాకర పరిస్థితిని విన్న సీఎం ప్రజలను ఓదార్చారు. 'ప్రభుత్వం మీ వెంటే ఉంది. ఎవరినీ వదిలిపెట్టం. పంట నష్టానికి సరైన పరిహారం అందుతుంది. ఇళ్ళు కోల్పోయిన వారికి నివాసం కల్పిస్తాం. పొలాల్లో పేరుకుపోయిన ఇసుకను తొలగించేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తాం' అని భరోసా ఇచ్చారు. వరదల ప్రభావం ఇరిగేషన్ ప్రాజెక్టులపైనా పడింది. ముఖ్యంగా మైనర్, మేజర్ ప్రాజెక్టులు దెబ్బ తిన్నాయి. అయితే పోచారం ప్రాజెక్టు భీకర వరదను తట్టుకుని నిలబడటంతో పెద్ద నష్టం తప్పిందని సీఎం పేర్కొన్నారు. తక్షణం మరమ్మతులు చేసి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నామని సీఎం అధికారులను ఆదేశించారు.

**మదన్ మోహన్ నిజమైన నాయకుడు**

"ఇది వందేళ్లలో చూడని వరద. కష్టం వచ్చినప్పుడు ప్రజలకు అండగా నిలిచే వాడే నిజమైన నాయకుడు. ఎల్లారెడ్డి నియోజకవర్గం ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆ కర్తవ్యాన్ని నిబద్ధతతో నిర్వర్తించారు. ఇకపై ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం. అన్ని రకాల రోడ్లు, ప్రాజెక్టులు మరమ్మతు అవుతాయి. వ్యవసాయదారుల కష్టానికి తగిన పంటనష్టం పరిహారం ఇస్తాం. బాధిత కుటుంబాలు కోలుకునేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమగ్ర నివేదిక సమర్పించాలి. బాధలు తీరే వరకు మా సహాయం ఆగదు" అని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.



**కొడంగల్ తో పాటు కామారెడ్డిని అభివృద్ధి చేస్తా**

భారీ వర్షాలు, వరదల వల్ల నష్టం జరిగిన చోట శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వరదల వల్ల పంట పొలాల్లో ఇసుక మేటలను తొలగించేందుకు ప్రత్యేకంగా నిధులను మంజూరు చేస్తామని చెప్పారు. కొడంగల్‌కు ఎంత మేరకు సాయం చేస్తానో కామారెడ్డి జిల్లాకు కూడా అంత సాయం చేస్తానని మాటిచ్చారు. వరద నష్టంపై గ్రామాల వారిగా అంచనాలు రూపొందించి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. దెబ్బతిన్న రహదారులు, బ్రిడ్జీలు, మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులతో పాటు పంట నష్టానికి సహాయం అందిస్తామన్నారు. "వరదల వల్ల ఆస్తినష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రజలకు అండగా నిలిచారు. కష్టం వచ్చినప్పుడు అండగా ఉండే వారే నిజమైన నాయకుడు. ఎమ్మెల్యే లాగే కష్టాల్లో ఉన్నప్పుడు ప్రజలకు తోడుగా ఉండాలని నాయకులకు సూచిస్తున్నా. వరదలకు మైనర్, మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బ తిన్నాయి. పోచారం ప్రాజెక్టు భారీ వరదను కూడా తట్టుకుని నిలబడి అందర్నీ కాపాడింది. తాత్కాలిక మరమ్మతులు చేశాం. అయితే ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు, జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడానికే ఇక్కడికి వచ్చాం. నష్టపోయిన వారిని అన్ని విధాలుగా ఆదుకుంటాం.." అని ముఖ్యమంత్రి బాధితులకు భరోసానిచ్చారు. తొలుత ఎర్రపహాడ్ చేరుకున్న ముఖ్యమంత్రి ప్రజాప్రతినిధులతో కలిసి వరదల వల్ల దెబ్బ తిన్న ప్రాంతాలను పరిశీలించారు. వరదల వల్ల లింగంపేటలో దెబ్బతిన్న ఆర్ అండ్ బి బ్రిడ్జీని పరిశీలించారు.

**మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు అందజేత**

కామారెడ్డి జీఆర్ కాలనీని సందర్శించిన సందర్భంగా బాధితులతో మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి మరణించిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున, పశు సంపద కోల్పోయిన వారికి సాయం అందించాలని ఆదేశించారు. "భారీ వర్షాలు, వరదల వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఆస్తినష్టం జరిగినప్పటికీ అప్రమత్తంగా ఉండటం ప్రాణ నష్టం తగ్గించగలిగాం. వరదలు రాగానే క్షేత్రస్థాయిలో పర్యటించాల్సిందిగా జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్కని, సలహాదారు షబ్బీర్ అలీని, ఎంపీ సురేష్ షేట్కర్‌ని, ఎమ్మెల్యేలను ఆదేశించాను. ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు చేశా. ఇక్కడి సమస్యల పరిష్కారానికి వందశాతం ప్రభుత్వం కృషి చేస్తుంది. విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, ఇతర సామగ్రిని అందించేందుకు చర్యలు తీసుకుంటాం.." అని ముఖ్యమంత్రి స్పష్టంగా చెప్పారు.

**అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలి..**

పర్యటనలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. వరద నష్టం ఎక్కువగా జరగకుండా అప్రమత్తమై, సరైన సమయంలో స్పందించి చర్యలు చేపట్టిన అధికారులను ఆయన అభినందించారు. పరిపాలనా సౌలభ్యం కోసం వివిధ శాఖలను ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. క్రైసిస్ మేనేజ్ మెంట్ సమయంలో శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు వివిధ శాఖలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. సమస్య వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా మానవత్వంతో వ్యవహరించాలన్నారు.

**భవిష్యత్ ప్రణాళికలు రూపొందించాలి**

సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు పకడ్బందీగా అమలు చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రాబోయే 15 రోజుల్లో మరోసారి సమీక్ష నిర్వహిస్తామన్నారు. నిజామాబాద్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి ఇంచార్జ్ మంత్రి సీతక్క ప్రత్యేక సమీక్ష నిర్వహిస్తారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించిన సమస్యలను సమీక్షలో సీతక్క దృష్టికి తీసుకురావాలని సూచించారు. నిబంధనల ప్రకారం కేంద్ర ప్రభుత్వం నుంచి రిలీఫ్ ఫండ్‌ను రాబట్టుకోవాలని చెప్పుకొచ్చారు. భవిష్యత్‌లో ఇలాంటి పరిస్థితులు తలెత్తకుండా శాశ్వత ప్రణాళికలు రూపొందించడానికి అధికారులు కృషి చేయాలని సీఎం వివరించారు.

### అందుబాటులో యూరియా

యూరియా కోసం రైతులు ఎక్కువ సేపు లైన్లో నిలబడి అలిసిపోతున్నారని సీఎం తెలిపారు. అలిసిపోవడం వల్ల అసలు యూరియా లేదని చెప్తున్నారని పేర్కొన్నారు. యూరియా సరిపడా అందుబాటులో ఉందని చెప్పుకొచ్చారు. అందరూ ఒకే దగ్గర ఉండేసరికి యూరియా కోసం ఉన్న లైన్ పెద్దగా కనిపిస్తుందని స్పష్టం చేశారు. లైన్ లో చివర ఉన్న వారికి యూరియా ఇవ్వాలంటే 8 గంటల సమయం పడుతుందని వివరించారు. ఆ 8 గంటలు లైన్ లో నిలబడలేక, సహనం కోల్పోయి ధర్నాలు చేస్తున్నారన్నారు. రైతులను ఎవరో ఒకరు తీసుకెళ్లి కావాలనే రోడ్ల మీద కూర్చోపెడుతున్నారని సీఎం ఆరోపించారు.

# ఎస్ఎల్బీసీ పనులు ఆగొద్దు

## ఒక్క రోజు పనులు ఆలస్యం చేసినా ఒప్పుకోను

### గ్రీన్ ఛానల్‌లో నిధులు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధం

### సొరంగం తొవ్వకంలో సింగరేణి నిపుణుల సేవలను వినియోగించుకోవాలి

### అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు

### ఎస్ఎల్బీసీ పనులపై మంత్రి ఉత్తమ్, అధికారులతో సీఎం సమీక్ష



హైదరాబాద్, మహా: ఒక్క రోజు కూడా ఎస్ఎల్బీసీ పనులు ఆలస్యం కావడానికి వీలు లేదని ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఎస్ఎల్బీసీ కేవలం నల్గొండ జిల్లాకే కాదు తెలంగాణకు అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా నీళ్లు అందించడానికి ఎస్ఎల్బీసీతో అవకాశం ఉందన్నారు. గురువారం హైదరాబాద్‌లో ఎస్ఎల్బీసీ పనులపై ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైలం నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు ఉన్న సమస్యలపై తక్షణమే తనకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. ఒక్క సమావేశంలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చేద్దామన్నారు. అటవీ శాఖ అనుమతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలంటూ అధికారులకు సూచించారు. 2027 డిసెంబరు 9వ తేదీ లోపు.. ఎస్ఎల్‌బీసీని పూర్తి చేయాలని అధికారులకు లక్ష్యాన్ని సీఎం రేవంత్ రెడ్డి నిర్దేశించారు.

**ఎట్టి పరిస్థితుల్లో ఎస్ఎల్బీసీ పూర్తి..**

ఎస్ఎల్‌బీసీ పనులకు గ్రీన్ ఛానల్‌లో నిధులు ఇవ్వడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. సొరంగం పనుల కోసం కాంట్రాక్టు సంస్థ జేపీ అసోసియేట్స్ అన్ని పరికరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్టు సంస్థ ఒక్క రోజు పనులు ఆలస్యం చేసినా ఒప్పుకోనని సీఎం రేవంత్ రెడ్డి కరాఖండిగా చెప్పారు. సొరంగం తొవ్వకంలో సింగరేణి నిపుణుల సేవలను వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఎస్ఎల్‌బీసీ పనులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా జరగాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ఎస్ఎల్‌బీసీ పూర్తి కావాలని.. ఆ పనులు ఆగడానికి వీలు లేదని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ముఖ్య అనుచరులతో కవిత భేటీ

## భవిష్యత్ కార్యాచరణపై వ్యూహరచన

హైదరాబాద్, మహా : తెలంగాణ జాగృతి వ్యవస్థాపకురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత గురువారం తన ప్రధాన అనుచరులు, జాగృతి ముఖ్య నేతలతో రహస్యంగా భేటీ అయినట్లుగా తెలుస్తోంది. ఒకవేళ తాను పార్టీ పెడితే తన వెంట నడిచేది ఎవరు అనే విషయంపై కవిత ఆరా తీసినట్లు సమాచారం. బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటూ పెద్దగా ప్రాధాన్యత దక్కడం లేదని అసంతృప్తిగా ఉన్న నాయకులు, మాజీ ఎమ్మెల్యేల జాబితానే రెడీ చేయాలని కవిత తన అనుచరులకు చెప్పినట్లుగా సమాచారం. అంతేకాకుండా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో యాక్టివ్‌గా పని చేసిన ఉద్యమకారులను కవిత త్వరలో కలబోతున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా ఆమె వారిని జాగృతిలో చేరాలని కోరబోతున్నట్లుగా తెలుస్తోంది. కవిత తీసుకునే ఈ నిర్ణయాల వలన బీఆర్ఎస్ కు తీవ్రనష్టం జరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారనే కారణంతో బీఆర్ఎస్ పార్టీ కవితను సస్పెండ్ చేసింది. దీనితో, కవిత పార్టీకి, అలాగే తన ఎమ్మెల్సీ పదవికి, బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. కవిత బీఆర్ఎస్ నుండి సస్పెండ్ అయ్యాక ఆమె కొత్త పార్టీని స్థాపించబోతున్నారని ప్రచారం జరుగుతోంది. కొత్తపార్టీ ఏర్పాటుకు తెరవెనుక జరుగుతున్న సన్నాహాలపై మహా పత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైన విషయం విదితమే. టీఆర్ఎస్ లేదా బీఆర్ఎస్ వచ్చేలా కవిత పార్టీ పేరు ఉండే అవకాశముందని, దీపావళికి పార్టీని లాంచ్ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.



# హ్యాపీ రావు లీలలు

## కవితక్క అప్ డేట్స్

### పల్లెప్రగతిలో 120 కోట్ల అవినీతి

### సంతోష్ పై నేరెళ్ళ బాధితుల ఫిర్యాదు



హైదరాబాద్, మహా: కవితక్క అప్ డేట్స్ అంటూ అభిమానులు తమ వ్యతిరేకులపై వరుస బాంబులు పేలుస్తున్నారు. బీఆర్ఎస్ నేత ఒకరు ట్రాక్టర్లతో ఏకంగా రూ. 120 కోట్లు నొక్కేశారని కవిత మద్దతుదారులు సోషల్ మీడియాలో పోస్టు చేయడం సంచలనంగా మారింది. హ్యాపీరావు అంటూ చేసిన ఈ వ్యాఖ్యలు సంతోష్ రావును ఉద్దేశించే అనే చర్చ సామాజిక మాధ్యమాల్లో జరుగుతోంది. హరీశ్ రావు, సంతోష్‌రావు మా కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే ప్రయత్నాలు చేస్తున్నారని కవిత ఆరోపించారు. కేసీఆర్ హరితవనం పేరుతో కార్యక్రమం చేస్తే దాన్ని గ్రీన్ చాలెంజ్ పేరుతో నకిలీ కార్యక్రమం చేసి హైజాక్ చేశారని సంతోష్ పై కవిత ఘాటు వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఇపుడు ఓ నేత రూ. 120 కోట్ల అవినీతికి పాల్పడ్డారంటూ సంచలన పోస్టు 'కవితక్క అప్ డేట్స్' పేరుతో ఉన్న ఐడీలో షేర్ కావడం కలకలం రేపుతోంది. ఈ పోస్టు లోని వివరాల ప్రకారం.. 'కేసీఆర్ మహాత్మా గాంధీ స్ఫూర్తితో పల్లెప్రగతి అనే అద్భుతమైన కార్యక్రమాన్ని ప్రారంభిస్తే హ్యాపీ రావు కన్ను ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ఇచ్చే ట్రాక్టర్లపై పడింది. దాంతో సిద్దిపేట జిల్లా కోహెడ మండలం వరికోల్ గ్రామానికి చెందిన కోడిపందాలు చేసే క్లాస్ ఫ్రెండ్ తో రూ.120 పైగా కోట్ల కమిషన్ కోసం హ్యాపీ రావు స్కెచ్ వేశాడు. అప్పటికే ఆ బినామికి ట్రాక్టర్‌కి సంబంధించిన బిజినెస్ చేసిన అనుభవం ఉండటం వల్ల బెంగళూరులో ట్రాక్టర్ కంపెనీలను పిలిపించుకుని ఒక్కో ట్రాక్టర్‌కు లక్ష రూపాయిలు ఇవ్వాలనే ఒప్పందం కుదిరించుకున్నారు. ఈ ఒప్పందంలో అప్పటి సంబంధిత శాఖ మంత్రిని దయ లేకుండా పక్కన పెట్టి, అతనికి వాటా ఇవ్వలేదు. ఆ మంత్రి కావాలని గట్టిగా అడగగా, అతనికి ఒక ఖరీదైన కారు ఇంటికి పంపించారు. ఆ తర్వాత ఆ కారుకు ఈఎంఐ కూడా కట్టలేదు. హ్యాపీ రావు వల్ల ఇప్పటికీ ఆ సదరు మాజీ మంత్రి అవసరం లేని ఆ కారుకు తన సొంత డబ్బులతో ఈఎంఐ కట్టుకోవాల్సిన పరిస్థితికి వచ్చారు. ఆ 120కి పైగా కోట్లు ఇద్దరూ పంచుకుని ఆ మంత్రికి మాత్రం మొండి చేయి చూపించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ ఇద్దరు నాయకులకు కొన్ని రోజులు మాటలు లేకపోయాయని ఈ మధ్యనే కుట్టుమిషన్లు పంచుతున్నారు' అని పోస్టు చేశారు. ఈ పోస్టు ఇప్పుడు వైరల్ గా మారింది.

**ఫ్రమ్ బెంగుళూరు టు వరికోల్**

కవితక్క అప్ డేట్స్ ఎక్స్ ఖాతా హ్యాపీ రావు విషయం గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బయట పెడతానని ప్రకటించగా ఆ మేరకు పై వివరాలతో పోస్టు చేశారు. అయితే కవితక్కపై విమర్శలు చేసే నేతలను ఈ ఐడీ టార్గెట్ చేయబోతున్నట్లు స్పష్టం అవుతోంది. వరుసగా 15 రోజుల సిరీస్ రూపంలో ఒక్కొక్క నేత అవినీతి చిట్టా బహిర్గతం చేసే ప్లాన్ తో ఉన్నట్లు సదరు ఐడీలో పోస్టుల ను బట్టి తెలుస్తోంది. ఇన్నాళ్లు కవిత వెంట నడిచిన మేడే రాజీవ్ సాగర్ కవితపై విమర్శలు చేశారు. తాను కేసీఆర్ వెంట నడుస్తున్నట్లు ప్రకటించారు. అలాగే తమకు చెప్పకుండా కవిత నిర్ణయం తీసుకోవడం పట్ల విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో కవితక్క అప్ డేట్స్ ఐడీ రాజీవ్ వ్యాఖ్యలకు కౌంటర్ గా రియాక్ట్ అయింది. 'మాట్లాడుకుందాం..15 రోజుల సిరీస్ లో రాజీవ్ లీలు కూడా ఉన్నాయి' అంటూ అప్ డేట్ ఇచ్చింది. దీంతో రాజీవ్ లీలలు ఏంటి? మేడే రాజీవ్ సాగర్ ను ఉద్దేశించే ఈ పోస్టు పెట్టారా అనేది సస్పెన్స్ గా మారింది.

**హంప్టీ డంప్టీ పార్టీ ఓనర్ బలి**

హంప్టీ డంప్టీ పార్టీ ఓనర్ బలి అంటూ రసమయి సంతోష్ బాబుకు మద్దతుగా వరుసగా ఇస్తున్న ఇంటర్వ్యూను పోస్ట్ చేసి కామెంట్స్ చేశారు. శుక్రవారం 20మంది ఎమ్మెల్యేల జాబితా ప్రకటించే ప్రయత్నం చేస్తామని, 3గంటలకు చూడాలని కామెంట్స్ చేశారు. హరీష్, సంతోష్ మద్దతుదారులను కవిత టీమ్ నేరుగా టార్గెట్ చేసినట్లు కనబడుతోంది. మరోవైపు కవిత నేరెళ్ళ దళితులకు థర్డ్ డిగ్రీ సంతోష్ ఘనతే అంటే కామెంట్స్ చేయడంతో నేరెళ్ళ బాధితులు సంతోష్ పై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదుచేశారు.

# మోదీ తర్వాత స్థానంలో జూనియర్ ఎన్టీఆర్

## టాప్-10లో పవన్ కళ్యాణ్, మహేష్ బాబు

## ఇండియా ట్రెండింగ్







హైదరాబాద్, మహా

నెట్టింట ఎక్కువగా రాజకీయ నాయకులు, సినీ సెలబ్రిటీలు, క్రికెటర్లకు సంబంధించిన డిస్కషన్స్ జరుగుతుంటాయి. గత నెలలో భారత ప్రధాని నరేంద్ర మోదీ, టాలీవుడ్ స్టార్ హీరో జూనియర్ ఎన్టీఆర్ గురించి నెటిజన్లు అత్యధికంగా మాట్లాడుకున్నట్లు ఎక్స్ తెలిపింది. ఆగస్టు నెలలో ఇండియాలో ఎక్కువగా మాట్లాడుకున్న ప్రముఖుల జాబితాలో వీరిద్దరూ టాప్ లో ఉన్నట్లు ట్విట్టర్ ఎక్స్ తెలిపింది. సోషల్ మీడియా ఫ్లాట్ ఫామ్ ఎక్స్ ప్రతీ నెల, ప్రతీ ఏడాది నెట్టింట అత్యంత ఎక్కువగా మాట్లాడుకున్న సెలబ్రెటీల లిస్ట్ రిలీజ్ చేస్తూ ఉంటుంది. తాజాగా 2025 ఆగస్టు నెల టాప్10 జాబితాను విడుదల చేసింది. ఇందులో ప్రైమ్ మినిస్టర్ నరేంద్ర మోదీ అగ్ర స్థానంలో నిలిచారు. ఆ తర్వాతి స్థానంలో మ్యాన్ ఆఫ్ మాసెస్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఉన్నారు. థర్డ్ ప్లేస్ లో దళపతి విజయ్ ఉంటే, నాలుగో స్థానంలో పవన్ కళ్యాణ్ ఉన్నారు. భారత క్రికెటర్, టెస్ట్ టీం కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐదో ప్లేస్ లో కొనసాగారు. కాంగ్రెస్ లీడర్ రాహుల్ గాంధీ, భారత క్రికెట్ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ 6, 7 స్థానాల్లో ఉన్నారు. ఇండియా వైడ్ గా ఎక్కువగా మాట్లాడుకున్న ప్రముఖుల లిస్టులో టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు 8వ స్థానంలో ఉంటే, 9వ ప్లేస్ లో టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఉన్నారు. చివరగా తమిళ సూపర్ స్టార్ తలైవర్ రజనీకాంత్ టాప్10లో చోటు సంపాదించారు. గత నెలలో ఎక్స్ లో నెటిజన్లు ఎక్కువగా ఈ పదిమంది గురించే మాట్లాడుకున్నట్లు సంస్థ తెలిపింది.

# జాతీయ విపత్తుగా ప్రకటించి తక్షణమే ఆదుకోండి

## వర్షా లు, వరద నష్టం రూ. 5018.72 కోట్లు

### కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షాను కోరిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, మహా: ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా తెలంగాణలో పంట, ఆస్తి, ప్రాణ నష్టం జరిగిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే సాయం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కోరింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏ.పీ. జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ఉన్నతాధికారులు కలిసి గురువారం ఢిల్లీలో అమిత్ షా అధికారిక నివాసంలో కలసి పూర్తి వివరాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఆగస్టు 25-28 మధ్య తెలంగాణ రాష్ట్రంలో భారీ వర్షాలు కురిశాయని, ముఖ్యంగా కామారెడ్డి, మెదక్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో వరదలు సంభవించి భారీ విధ్వంసం సృష్టించాయని ప్రతినిధి బృందం తెలిపింది. ఈ జిల్లాల్లో మౌలిక సదుపాయాలకు తీవ్రమైన నష్టం వాటిల్లిందని, రాష్ట్రంలో ఇప్పటివరకు నమోదైన వర్షపాతం సాధారణం కంటే 25 శాతం అధికంగా ఉందిని చెప్పారు. ఎనిమిది జిల్లాల్లో 65 నుంచి 95 శాతం అదనపు వర్షపాతం నమోదైందని, వర్షాలు కొనసాగుతూనే ఉండటంతో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు, పంటలు, పశువులు, మానవ ప్రాణాలు నష్టపోయాయని మంత్రులు వివరించారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం మొత్తం వనరులను సమీకరించి సహాయ చర్యలు చేపడుతుందని, ఏడు ఎన్డీఆర్ఎఫ్, 15 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, సుమారు 100 మంది సైనిక సిబ్బంది సహాయ కార్యకలాపాలలో పాల్గొంటున్నారని తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణతో ప్రాణనష్టాన్ని సాధ్యమైనంతవరకు తగ్గించగలిగామని మంత్రులు పేర్కొన్నారు. అయితే, గత 72 గంటల్లో కురిసిన వర్షాల తీవ్రతతో రోడ్లు, రైల్వే ట్రాక్‌లు, కల్వర్టులు, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వంటి మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, రాష్ట్రవ్యాప్తంగా సాధారణ జీవన విధానానికి అంతరాయం ఏర్పడిందని స్పష్టంచేశారు. ఈ పరిస్థితిని జాతీయ విపత్తుగా పరిగణించాలని కేంద్ర హోంమంత్రిని కోరారు. అదేవిధంగా, వరద ప్రభావిత ప్రాంతాలను స్వయంగా సందర్శించి నష్టాలను అంచనా వేయాలని, కేంద్ర ప్రభుత్వ బృందాన్ని తెలంగాణకు పంపాలని విజ్ఞప్తి చేశారు. ప్రాథమిక అంచనాల ప్రకారం ఇప్పటివరకు రాష్ట్రంలో 22 మరణాలు సంభవించాయని, పాడి పశువుల మరణాలు, గృహ నష్టాలు, పంట నష్టాల గణన కొనసాగుతోందని మంత్రుల బృందం వివరించింది.

# ఫేక్ ప్రచారంతో విష విత్తనాలు

## ఎరువుల రవాణాను అడ్డుకుంటున్న వైసీపీ

### రైతుల ముసుగులో వైసీపీ రాజకీయం.. సమృద్ధిగా ఎరువుల నిల్వలు

### ఎరువుల సరఫరాపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిన సీఎం చంద్రబాబు

**అమరావతి, మహా:** అన్ని విషయాల్లోనూ ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ... ఎరువుల విషయంలోనూ అదే తరహా దుష్ప్రచారాన్ని చేస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మండిపడ్డారు. విషవృక్షం లాంటి వైసీపీ చేసే దుష్ప్రచారాల్లో భాగంగా... మరో ఫేక్ స్టోరీని ప్రచారం చేస్తోందని... యూరియా, ఎరువుల కొరత ఉందని దుష్ప్రచారం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ పార్టీ, నేరాలను నమ్ముకున్న పార్టీ, విషపు విత్తనాలను చల్లుతోందని చంద్రబాబు విమర్శించారు. ఎరువుల లభ్యత.. సరఫరాపై రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల వారీగా ఎరువుల సరఫరా లెక్కలను వివరించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."ఈ ఖరీఫ్ సీజనులో ఓపెనింగ్ బ్యాలెన్సుతో కలిపి 6.65 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశాం. బుధవారం నాటికి 94,892 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉంది. ఇది కాకుండా గత 10 రోజుల్లో సుమారు 28 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశాం. వచ్చే 10 రోజుల్లో 30 వేల టన్నులు సరఫరాకు అందుబాటులోకి రానుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి మరో 53 వేల టన్నుల కేటాయింపులు తెచ్చుకున్నాం. సెప్టెంబర్ 12 నుంచి 30వ తేదీ లోపు మరో లక్ష టన్నులు తెచ్చుకుంటాం. అంటే సెప్టెంబర్ నెలఖరు నాటికి 2.71 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుంది. రైతులు ఆందోళన చెందవద్దు. భవిష్యత్ అవసరాలకు తగ్గట్టు ఎరువులను సిద్ధం చేస్తాం. వచ్చే రబీ నాటికి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 9.38 లక్షల టన్నులు కేటాయింపులు ఇప్పటికే చేసుకున్నాం. కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడాను. జిల్లాల్లో అన్ని రిటైల్ షాపుల్లో, ప్రస్తుత నిల్వలు, సరఫరాపై సమీక్ష చేసుకుని అవసరం ఉన్న దగ్గరకు ఎరువులు తరలించాలని చెప్పాం. డిమాండ్ ఉన్న జిల్లాలకు మార్క్ ఫెడ్ ద్వారా ఎరువులు తరలించి రైతులకు సరఫరా చేస్తాం. పొరుగు రాష్ట్రాల సరిహద్దుల్లో గట్టి నిఘా పెట్టి ఎరువులు పక్కదారి పట్టకుండా చూడమని చెప్పాం." అని చంద్రబాబు స్పష్టం చేశారు.

**ఫేక్ ప్రచారం చేస్తే తీవ్ర పరిణామాలు**

సోషల్ మీడియాలో వివిధ అంశాలపై జరుగుతున్న ఫేక్ ప్రచారాలపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. "డ్రామాలు ఆడితే పరిణామాలు తీవ్రంగా ఉంటాయి. దుష్ప్రచారం చేసే వారిని జైలుకు పంపుతాం. యూరియా విషయంలో కృష్ణా జిల్లాలో వైసీపీకి చెందిన ఎర్రా వాసు, రామ్మూర్తి, చిలీ వెంకటేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు కుట్రపూరితంగా వ్యవహరించారు. ఎరువుల లారీని హైజాక్ చేసే ప్రయత్నం చేశారు. రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్




ఎరువుల విషయంలో దుష్ప్రచారం చేస్తున్నారు. ఫేక్ రాజకీయాలు చేసినా, సోషల్ మీడియా ద్వారా దుష్ప్రచారం చేసినా తీవ్ర పరిణామాలు ఉంటాయి. అన్ని జిల్లాల్లో ఎంతెంత స్టాక్ ఉందో... ఏయే దుకాణాల్లో ఎంత నిల్వలున్నాయనే వివరాలు కూడా ప్రభుత్వం దగ్గర ఉన్నాయి. తప్పుడు ప్రచారం చేసి ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తే ఊరుకోం. ప్రభుత్వాన్ని అప్రదిష్ట పాల్జేయడానికి ప్రయత్నిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. ప్రస్తుతం రైతులు ఎక్కడెక్కడ ఎంత యూరియాను వినియోగిస్తున్నారో లెక్కలు తీసి మీడియాకు ఇస్తాం. రైతుల ముసుగులో వైసీపీ కార్యకర్తలు రాజకీయం చేస్తే ఖబడ్దార్ అని హెచ్చరిస్తున్నా. నేరాలు ఘోరాలు చేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. కుప్పంలో నీరిస్తే... నీళ్లు లేవని ప్రచారం చేశారు. పులివెందులకు మేం నీరిస్తే... వైసీపీ వాళ్లు వెళ్లి... తామే ఇచ్చినట్టుగా హారతులిచ్చారు. సోషల్ మీడియా ఉంది కదా అని తప్పుడు వార్తలు రాస్తే చూస్తూ ఊరుకోం. స్టీల్ ప్లాంట్ కు రూ.12 వేల కోట్లు కేంద్రం నిధులిచ్చి ఆదుకుంటే పేటీఎం బ్యాచ్ ద్వారా కొందరు రాజకీయాలు చేస్తున్నారు. ఉద్యోగుల వయో పరిమితి విషయంలో ఫేక్ జీవో సృష్టించి ఫేక్ ప్రచారం చేశారు. పేటీఎం బ్యాచ్ తప్పుడు పోస్టులు చేసి.. ఆందోళన కలిగించి.. రాజకీయ ప్రయోజనం పొందాలని చూస్తే తాట తీస్తాం. కావాలని అలజడులు సృష్టిస్తే జైలుకు పంపుతాం. మొన్నటి వరకు మహిళల పైనా.. నిన్న రాజధాని పైనా.. ఇప్పుడు రైతులను తప్పుదోవ పట్టించేలా చేస్తున్నారు. ఇలాంటి వారిని ఖచ్చితంగా నియంత్రిస్తాం." అని సీఎం అన్నారు.

**భ్రమల్లో ఉంటారు... భ్రమలు కల్పిస్తారు**

"అవాస్తవాలను కూడా వాస్తవమని నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. హెరిటేజ్ అవుట్ లెట్లే లేవు. అయినా హెరిటేజ్ దుకాణాలు ఉన్నాయంటూ విష ప్రచారం చేస్తూ... విచిత్రమైన వింత జీవుల్లా వ్యవహరిస్తున్నారు. ఊహాగానాల్లో బతికేస్తున్నారు. ఏం చెప్పినా... ప్రజలు నమ్మేస్తారని వైసీపీ అనుకుంటోంది. వాళ్లను చూస్తుంటే జాలి వేస్తుంది. విలువల్లేని వ్యక్తులు రాజకీయాల్లో ఉన్నప్పుడు... ఇలాంటి సమస్యలే వస్తాయి. వాళ్లు దుష్ప్రచారం చేస్తుంటే... మేం వాటిని సరి చేస్తూ కూర్చోవాలా..? అసెంబ్లీకి వచ్చి సమస్యలపై చర్చించమంటే... ప్రతిపక్ష హోదా ఇవ్వాలని అంటున్నారు. వీరికి అసలు బుద్ధుందా..? ప్రజలిచ్చిన సీట్లతోనే ప్రతిపక్ష హోదా వస్తుంది. ఆ హోదాకు కూడా తగరనే వైసీపీకి 11 సీట్లు ఇచ్చారు. ప్రతిపక్షం కావాలంటే అసెంబ్లీలో 18 సీట్ల సంఖ్యాబలం ఉండాలని తెలియదా..? ఓట్లేయలేదని ప్రజలపై కక్ష పెట్టుకున్నట్టు వ్యవహరిస్తున్నారు. కోడి కత్తి, గొడ్డలివేటు, గుండెపోటు, గులకరాయి డ్రామాలతో పాటు... ఎరువులిస్తున్నా ఇవ్వడం లేదని ఫేక్ డ్రామాలు ఆడుతున్నారు." అని చంద్రబాబు విమర్శించారు.

**త్వరలో రైతులతో సమావేశం**

"దుష్ప్రచారంతో రెచ్చగొడుతూ... రైతులను రోడ్డున పడేస్తున్నారు. వీరి రాజకీయ ఉచ్చులో రైతులు పడొద్దు. త్వరలోనే రైతులతో సమావేశం నిర్వహిస్తాం... వాస్తవాలు వివరిస్తాం. గత ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు జరిగేవి. నీళ్లు లేక, పెట్టుబడి సాయం అందక, ఆదుకునే వారు లేక.. నిస్పృహతో రైతులు ఆత్మహత్యలు చేసుకునేవారు. కూటమి అధికారంలోకి వచ్చాక... రైతుల మీద ఒత్తిడి తగ్గింది. అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడి సాయం అందిస్తున్నాం. వ్యవసాయానికి కావాల్సిన నీళ్లను సమృద్ధిగా సరఫరా చేస్తున్నాం. పంటలు పండేందుకు కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం. అందుకే రైతుల ఆత్మహత్యలు ఇప్పుడు లేవు. రైతులకు మంచి చేస్తుంటే... వైసీపీ ఓర్వలేకపోతోంది. ఏ కారణాల వల్లనైనా పంటలకు సరైన ధర లేకపోతే ప్రభుత్వం తరపున ఆదుకుంటున్నాం. అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా చూస్తున్నాం. వాణిజ్య పంటలకు మార్కెటింగులో ఇబ్బందులు రాకుండా చూస్తున్నాం. తాజాగా కాఫీ పంటకు బెర్రి బోరర్ తెగులు వచ్చింది. ఇది మరింత విస్తరించకుండా చర్యలు చేపట్టాం. తెగులు సోకిన పంటను ధ్వంసం చేసి రైతులకు తగినంత పరిహారం ఇస్తున్నాం. ఈ సందర్భంగా రైతులకు ఓ విజ్ఞప్తి. తెలియక ఎక్కువ పురుగు మందులు వినియోగిస్తున్నారు. పురుగు మందుల వినియోగం ఎక్కువగా జరిగితే... మన పంటలు కొనుగోలు చేసే పరిస్థితి ఉండదు. తిండి, వాతావరణం కూడా కలుషితం అవుతుంది. ఆర్గానిక్ పంటలే రైతులకు లాభాదాయకం." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## అనారోగ్యంతో బాధపడుతున్న నటుడు రామచంద్రకు మనంసైతం కుటుంబం ద్వారా కాదంబరి కిరణ్ ఆర్థిక సాయం

**హైదరాబాద్:** తెలుగు సినీ నటుడు, 'మనంసైతం' నిర్వహకులు కాదంబరి కిరణ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. 'వెంకీ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నటుడు రామచంద్ర ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయం తెలుసుకుని, కాదంబరి కిరణ్ ఆయనకు సహాయం అందించారు. ఇటీవల పక్షవాతం రావడంతో సినిమా రంగానికి దూరమైన రామచంద్రను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సందర్శించి, వైద్య ఖర్చుల కోసం 25,000 రూపాయల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. కాదంబరి కిరణ్ రామచంద్రను ఆప్యాయంగా పలకరించి, ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి వివరంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అతనికి ధైర్యం, భరోసా కల్పించారు. కాదంబరి కిరణ్ అందించిన సాయానికి రామచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. 'మనంసైతం' సంస్థ ద్వారా దశాబ్దకాలంగా అనేకమంది అవసరార్థులకు సాయం అందిస్తున్న కాదంబరి కిరణ్, సమాజ సేవకు తమ సంస్థ ఎల్లప్పుడూ అంకితమై ఉంటుందని పునరుద్ఘాటించారు.



# బీజేపీలో అవినీతి పరులకు స్థానం లేదు

- కవిత లాంటి వారిని ఎట్టిపరిస్థితుల్లో చేర్చుకోం
- తెలంగాణలో యూరియా కొరతను కాంగ్రెస్ సృష్టిస్తోంది
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కీలక వ్యాఖ్యలు
- జీఎస్టీ రేట్స్ తగ్గించినందుకు మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలి



**హైదరాబాద్, మహా:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీలో అవినీతి పరులకు స్థానం లేదని, కవితని తమ పార్టీలోకి తీసుకోమని స్పష్టం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గబ్బర్ సింగ్ టాక్స్ అన్న వారి తలలో మెదడు లేదు పెండ(గోబర్) ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటే.. ఆ రెండు పార్టీలు అన్నదమ్ములు అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కు సంబంధించి కేవలం బ్యారేజీలపైనే కాదు.. మొత్తం ప్రాజెక్ట్ మీద సీబీఐ విచారణ జరపాలన్నారు. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు కుమ్మక్కయ్యాయని ఆరోపించారు. కవిత గురించి ఎక్కువగా ఆలోచించొద్దని తెలిపారు. యూరియా కొరతపై స్పందించిన ఆయన.. కాంగ్రెస్ పొరపాటు వల్లనే తెలంగాణలో ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రేట్స్ తగ్గించి అన్ని వర్గాలకు పండుగ బహుమానం కేంద్రం ఇచ్చిందని అన్నారు. 'మోదీ నేతృత్వంలో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. పన్నుల వ్యవస్థను సరళీకరణ చేశారు. నిత్యావసర వస్తువులపై టాక్స్ ను జీరో చేశారు. మిడిల్ క్లాస్ ప్రజలకు ఎంతో ఊరట లభించింది. మోడీ, నిర్మల సీతారామన్ కి కృతజ్ఞతలు. జీఎస్టీ రేట్స్ తగ్గించినందుకు నరేంద్ర మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలకు పిలుపునిస్తున్నాం.

భారతదేశం అమెరికా, రష్యా వంటి దేశాలపై ఆధారపడే దేశం కాదు. అమెరికా విధించే టారిఫ్ వల్ల ప్రపంచ దేశాలు భయపడుతున్నా, భారత్ మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియా కాంకెప్ట్‌ను ముందుకు తీసుకుని జీఎస్టీ రేట్లు తగ్గించింది. దీని ఫలితంగా పేదలు, మధ్యతరగతి ప్రజలకు నేరుగా లాభం కలిగింది. ప్రపంచంలో జీఎస్టీని ప్రవేశపెట్టిన ఇతర దేశాల్లో ఆ ప్రభుత్వం అధికారంలో నిలబడలేకపోయినా, భారత్‌లో వన్నేషన్‌వన్ ట్యాక్స్ అమలు చేసిన తర్వాత మోదీ ప్రభుత్వం రెండు సార్లు విజయవంతంగా అధికారంలోకి వచ్చి, సింప్లిఫైడ్ ట్యాక్స్ ద్వారా దేశాన్ని బలోపేతం చేసింది. సింప్లిఫైడ్ టాక్స్ సిస్టమ్ వల్ల దేశ అభివృద్ధికి దోహదమైంది. మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియాకాన్సెప్ట్‌తో జీఎస్టీ తగ్గించడం ద్వారా పేదలు, మధ్యతరగతి ప్రజలకు నేరుగా లాభం జరుగుతోంది. తెలంగాణలో యూరియా కృత్రిమ కొరతను కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టిస్తోంది. మోదీ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అవసరమైన యూరియాను పంపిణీ చేస్తోంది. రాష్ట్రంలో బ్లాక్ మార్కెట్‌ను అడ్డుకోలేకపోతోంది' అని రామచందర్ రావు అన్నారు

# రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కోసమే జేపీవో

- రైతాంగానికి మరింత మెరుగైన సేవలు అందిస్తాం: మంత్రి పొంగులేటి
- సీఎం రేవంత్ చేతుల మీదుగా నేడు నియామక పత్రాలు అందజేత
- కార్యక్రమంపై రెవెన్యూ అధికారులతో మంత్రి సమీక్ష

**హైదరాబాద్, మహా:** రైతాంగానికి మరింత మెరుగైన సేవలందించడానికి గ్రామస్థాయిలో రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరిస్తూ బలోపేతం చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇవాళ సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా గ్రామపాలనాధికారులకు (జీపీవో) మాదాపూర్ లోని హైటెక్స్‌లో నియామక పత్రాలను అందజేస్తామని మంత్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ బి,ఆర్.అంబేద్కర్ సచివాలయంలో గ్రామపాలనాధికారులకు (జీపీవో) నియామాకాలు అందించే కార్యక్రమం ఏర్పాట్లపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గ్రామపాలనాధికారుల (జీపీవో) నియామకం చేపట్టి, వారి సేవలను ఒకటి రెండు రోజుల్లో అందుబాటులోకి తీసుకరాబోతున్నామని వెల్లడించారు.

**బీఆర్ఎస్ వాళ్లే రెవెన్యూ సేవలు దూరం..**

జీపీవోలుగా విధులు నిర్వహించడానికి ఆసక్తి చూపిన విఆర్వో, వీఆర్ఏ లకు రెండు విడతల్లో నిర్వహించిన రాత పరీక్షల్లో 5,106 మంది ఎంపికయ్యారని తెలిపారు. గత ప్రభుత్వ పెద్దలు వీఆర్వో , వీఆర్ఏ వ్యవస్థను రద్దు చేశారని, ఈ చర్య వల్ల గ్రామీణ ప్రాంతాల్లో సామాన్యులకు రెవెన్యూ సేవలు దూరమయ్యాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచనకు అనుగుణంగా రెవెన్యూ సేవలు గ్రామ స్థాయి వరకు అందించాలనే లక్ష్యంతో గ్రామ పరిపాలనాధికారులను నియమిస్తున్నామని చెప్పారు. భూభారతి చట్టం ద్వారా రాష్ట్రంలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్నభూ సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామని,. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి చేసిన నేపథ్యంలో ఇందుకు అవసరమైన లైసెన్స్‌డ్ సర్వేయర్ల సేవలను కూడా వచ్చేనెల మొదటివారం నుండి అందుబాటులోకి తీసుకురాబోతున్నామని చెప్పారు.



# అమిత్ షా పర్యటన రద్దు

## ప్రకటనలో హోంశాఖ వెల్లడి

ఢిల్లీ, మహా: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హైదరాబాద్ పర్యటన రద్దు అయింది. ఉపరాష్ట్రపతి ఎన్నికల సన్నాహకంలో భాగంగా అమిత్ షా పర్యటన రద్దు చేసినట్లు హోంశాఖ ప్రకటన విడుదల చేసింది. కాగా, గణేష్ నిమజ్జనంలో పాల్గొనేందుకు ఈ నెల 6న హైదరాబాద్‌కు వస్తారని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రకటించిన విషయం తెలిసిందే. నగరంలోని మొజాంజాహీ మార్కెట్ వద్ద గణనాథులకు స్వాగతం పలకడంతో పాటు గణేష్ శోభాయాత్రను ఉద్దేశించి ప్రసంగిస్తారని బీజేపీ వర్గాలు తెలిపాయి. అయితే ఉపరాష్ట్రపతి ఎన్నికల దృష్ట్యా ఆయన పర్యటన రద్దు అయినట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.









# కంటెస్టెంట్స్ లిస్ట్‌లో..
# మెరుపుల్లేవ్ అంతా తుస్సే...

## బిగ్ బాస్ 9 తెలుగు హాట్ డిస్కషన్
## సెప్టెంబర్ 07.. ఆదివారం గ్రాండ్ లాంచ్



మహా, ప్రత్యేకం: బిగ్ బాస్.. బిగ్ బాస్.. ట్రోలేవాళ్ళు ట్రోలినా.. బిగ్ బాస్ తెలుగునాట ఒక హాట్ డిస్కషన్. నెట్టింట బిగ్ బాస్ పై రచ్చ కొనసాగుతూనే ఉంది. బిగ్ బాస్ రియాలిటీ షో అనే పేరున్నా ఇది భావోద్వేగాల అల్లిక, వ్యూహాల పోరాటం, వ్యక్తిత్వాల ప్రతిబింబం. ఇంటి గోడల మధ్య నిత్యం నడిచే సంభాషణలు, వాగ్వాదాలు, అనుబంధాలు ప్రేక్షకులను కొత్త లోకంలోకి తీసుకెళ్తున్నాయి. ఎవరి మాటల్లో నిజాయితీ, ఎవరి కదలికల్లో మాయాజాలం ఉందో అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తూ ప్రేక్షకులు కూడా ఈ ప్రయాణంలో భాగస్వాములవుతున్నారు. ఇపుడు బిగ్ బాస్ సీజన్ 9 సెప్టెంబర్ 7న షురూ కాబోతోంది.


ANN TELUGU
మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్ | 05-09-2025
WWW.MAHAADAILY.COM




## ఎందుకొచ్చిన బిగ్ బాస్

బిగ్ బాసా? ఎప్పుడొస్తుందీ అని ఎదురుచూసే వాళ్లకంటే కూడా.. ఎందుకొచ్చిన బిగ్ బాస్ రా బాబూ.. పనీపాటా లేని పనికిమాలినోళ్లని తీసుకొచ్చి ప్రతిరోజూ వెధవ సోది.. అని తిట్టుకునే వాళ్లే ఎక్కువ ఉంటారు. కానీ తిట్టుకుంటూ చూడటమే షో స్పెషాలిటీ. ఎంత ఎక్కువ తిట్టుకుంటే.. అంత క్రేజ్ అన్నమాట. అంతేతప్పా.. బిగ్ బాస్ లో ఎంటర్ టైన్ మెంట్ ఎక్కడా వినిపించదు. మరి తిట్టుకుంటూ చూడ్డం ఎందుకు అంటే.. పక్కింట్లో ఏదో జరుగుతుందంటే మనం చెవులురిక్కిరించుకుని వింటాం.. అలాంటిది ఒకరు ఇద్దరు కాదు.. ఏకంగా 20 మంది పర్సనల్ లైఫ్ కళ్ళముందు కనబడుతుంది కాబట్టే చర్చ.. రచ్చ. తిట్టుకున్నా ఆసక్తే. అందుకే షోకి క్రేజ్. ఒక్కసారి బిగ్ బాస్‌కి వెళ్లారంటే జీవితాలు సంకనాకిపోతాయ్.. కెరీర్, ఫ్యూచర్ పెద్దగా ఉండదని చెబుతున్నా బిగ్ బాస్‌కి వెళ్లడానికి ఉవ్విళ్లూరుతుంటారు. కొంతమంది డబ్బు కోసం.. ఇంకొంతమంది నేమ్ అండ్ ఫేమ్ కోసం.. సినిమా ఆఫర్లు లేవు కనీసం ఈ బిగ్ బాస్ ఆఫర్‌నైనా యూజ్ చేసుకుందాం అని వచ్చేవాళ్లూ ఉంటారు. ఏది ఏమైనా బిగ్ బాస్‌కి వెళ్లాలనే పిచ్చితో వచ్చేవాళ్లూ ఉంటారు. హౌస్‌లోకి వెళ్లడానికి కారణాలు ఏమైనా కావచ్చు కానీ సీజన్ 9కి సంబంధించి హౌస్‌లో అడుగుపెట్టబోయే కంటెస్టెంట్స్ అయితే రెడీ అయిపోయారు. ప్రతి సీజన్‌లో ఓ రెండు మూడు వందలమంది లిస్ట్‌ని రెడీ చేసుకుని.. వాళ్లతో బేరసారాలు జరిపి.. అగ్రిమెంట్‌లు చేయించుకుని హౌస్‌లోకి పంపేవారు. అయితే ఈసారి అగ్నిపరీక్ష అంటూ సోషల్ మీడియాలో పాపులర్ అయిన వాళ్లని.. తీసుకొచ్చి వాళ్లకి ఆడిషన్స్ చేసి.. అగ్నిపరీక్ష పేరుతో హంగామా చేసి.. వాళ్లలో ఓ ఐదుగుర్ని హౌస్‌లోకి పంపిస్తున్నారు. వాళ్లకి సంబంధించిన ఓటింగ్‌లు బ్యాటింగ్‌లుచివరికొచ్చాయి. ఆ ఐదుగుర్ని పక్కన పెడితే.. మరి మిగిలిన వాళ్ల సంగతి ఏంటంటే.. మరో 15 మంది కంటెస్టెంట్స్.. సెప్టెంబర్ 07 ఆదివారం రాత్రి 7 గంటలకు ప్రారంభం కాబోయే బిగ్ బాస్ సీజన్ 9 గ్రాండ్ లాంఛ్‌లో హౌస్‌లోకి అడుగుపెట్టబోతున్నారు. వాళ్లలో ఓ లిస్ట్ బయటికొచ్చింది. బిగ్ బాస్ లిస్ట్ ముందుగా లీకులు ఇచ్చి.. పాపులర్ ఉన్నవాళ్ళతో, చర్చ జరిగిన వాళ్ళతో ఫైనల్ అగ్రిమెంట్స్ చేసుకోవడం కామన్. ఇపుడు కూడా అలాగే.. జరుగుతోంది.

### గ్రాండ్ లాంఛ్

సెప్టెంబర్ 07.. ఆదివారం నుంచి బిగ్ బాస్ ఆట మొదలుకాబోతుంది. సెప్టెంబర్ 7 ఆదివారం రాత్రి 7 గంటలకు గ్రాండ్ లాంఛ్ ఈవెంట్ ప్రారంభం కానుండగా.. హౌస్‌లోకి 16 మంది కంటెస్టెంట్స్ అడుగు పెట్టబోతున్నారు. మరో ఐదుగురు అగ్నిపరీక్ష ద్వారా సెలెక్ట్ చేసిన కంటెస్టెంట్స్.. తరువాతి వారాల్లో వైల్డ్ కార్డ్ ఎంట్రీలు ఉండబోతున్నాయి. మొత్తం సీజన్ 9ని రంజుగా మార్చే సింది సన్నాహాలు జరుగుతున్నాయి. అయితే ఆటలో మజా రావాలంటే ఆటగాళ్లే కీలకం. మరి ఈ సీజన్‌లో హౌస్‌లోకి అడుగుపెట్టబోతున్న కంటెస్టెంట్స్ ఎవరో చూద్దాం.

### బిగ్ బాస్ తెలుగు 9 కంటెస్టెంట్స్ లిస్ట్ :

1. కమెడియన్ ఇమ్మానుయేల్ (జబర్దస్త్ ఫేమ్)
2. కమెడియన్ సుమన్ శెట్టి (7/G బృందావనకాలనీ)
3. అలేఖ్య చిట్టి పికిల్స్ రమ్య (చిట్టి పికెల్స్ ఫేమ్)
4. సీరియల్ నటుడు భరణి శంకర్ (స్రవంతి సీరియల్ ఫేమ్)
5. హీరోయిన్ ఆశాషైనీ (నరసింహనాయుడు ఫేమ్)
6. సీరియల్ నటి తనూజా గౌడ (ముద్దమందారం ఫేమ్)
7. ఫోక్ సింగర్ రాము రాథోడ్ (రాను బొంబాయి రానూ సాంగ్ ఫేమ్)
8. హీరోయిన్ సంజనా గల్రానీ (బుజ్జిగాడు మూవీ ఫేమ్)
9 కొరియోగ్రాఫర్ శ్రేష్టి వర్మ (జానీ మాస్టర్ అసిస్టెంట్)
10.యాక్టర్ హర్షిత్ రెడ్డి (శుభం, కల్కి ఫేమ్)
11. జుబేదా సుల్తానా (కమెడియన్ అలీ వైఫ్)
12. కొరియోగ్రాఫర్ జానీమాస్టర్

### బిగ్ బాస్ అగ్నిపరీక్ష ద్వారా హౌస్‌లోకి వెళ్లే కంటెస్టెంట్స్ లిస్ట్

1.మాస్క్ మెన్ హరీష్
2. పవన్ కళ్యాణ్, 3. శ్రీజా
4. ప్రియా శెట్టి (లేదా) పవన్ డెమాన్
5. నాగ ప్రశాంత్ లేదా మనీష్

### 50 మందితో చర్చలు

అగ్నిపరీక్ష కంటెస్టెంట్స్‌ని పక్కన పెట్టి.. సెలబ్రిటీ లిస్ట్‌లో ఉన్నవారితో అగ్రిమెంట్స్ ఫైనల్ కాలేదట. గత సీజన్లలో హౌస్‌లోకి వెళ్లబోయే కంటెస్టెంట్స్‌కి ముందే కన్ఫామ్ అని చెప్పేవారు.. అగ్రిమెంట్స్ చేయించుకునే వారు. కానీ ఈసారి ఏకంగా 50 మందికి పైగా ఫైనల్ అగ్రిమెంట్ వరకూ సెలెక్ట్ చేసి వాళ్లని హోల్డ్‌లో పెట్టినట్టు తెలుస్తోంది. కాబట్టి.. అగ్రిమెంట్‌పై సంతకాలు అయినా కూడా.. హౌస్‌లోకి అడుగుపెట్టబోయేది ఎవరనేది సస్పెన్స్‌గా మారింది.




## ఎఎన్ఎన్ నర్సయ్యతాత
# ట్రెండ్ సెట్టర్

### అగ్నిపరీక్ష నుండి.. 60 ఇంటర్వ్యూల దాకా..
### పక్షం రోజుల్లో పదికోట్ల వీక్షణలు.. మోతమోగించిన తాత

**మహా స్పెషల్:** బిగ్ బాస్ షో అంటే.. ఒకప్పుడు సెలబ్రిటీలతో చూడబుల్ గా ఉండేది. ఇపుడంతా స్క్రాప్ బ్యాచే. టాలెంట్ ఉన్నోళ్ళని తొక్కేస్తారు.. టాలెంట్ లేనోళ్ళని నెత్తిన పెట్టుకుని ప్రేక్షకులకు అగ్నిపరీక్ష పెడతారు. రాను రానూ.. ఆ సెలబ్రిటీ షో క్రిడిబిలిటీ కాస్తా... యూట్యూబ్, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ షోగా మారిపోయింది. ఎవరైతే సోషల్ మీడియాలో రచ్చ చేస్తూ హాట్ టాపిక్ అవుతుంటారో ఇప్పుడు వాళ్లే బిగ్ బాస్ కంటెస్టెంట్స్. ఆడిషన్స్ కు వందలాది మంది అప్లై చేయగా.. వాళ్లలో ఓ 40 మందిని సెలెక్ట్ చేసి.. వారిలో 15 మందిని సెకండ్ రౌండ్‌కి పంపి, ఆ పదిహేను మందిలో ఐదుగుర్ని బిగ్ బాస్ సీజన్ 9 హౌస్‌లోకి పంపించబోతున్నారు. ఈ ప్రాసెస్‌కి బిగ్ బాస్ అగ్నిపరీక్ష అనే పేరు పెట్టారు. ఈ షోకి శ్రీముఖి హోస్టింగ్‌తో పాటు.. సూపర్ జడ్జీగా వ్యహరిస్తున్నారు. నవదీప్, బిందుమాధవి, అభిజిత్‌లు జడ్జిలుగా ఉన్నారు. ఈ జడ్జీలు ముగ్గురూ కలిసి.. బిగ్ బాస్ అగ్ని పరీక్ష కంటెస్టెంట్స్‌ని ఎంపిక చేయబోతున్నారు.

**లెక్కలేదు.. ఓటింగ్ లేదు**

అగ్ని పరీక్ష ఓ ప్రహసనంలా మారింది. ఈ ప్రాసెస్‌లో భాగంగా.. కొంతమందిని ఎంపిక చేయగా.. మరికొంతమందిని రిజెక్ట్ చేస్తున్నారు. ఎన్నో ఆశలతో ఆ స్టేజ్‌పైకి వచ్చిన వాళ్లని చిన్న చిన్న కారణాలతో రిజెక్ట్ చేసిపారేస్తున్నారు. కొందరికి అవకాశాలు ఇవ్వకుండా.. ముందే తమ వద్ద లిస్ట్ ఉన్నట్లు.. వీరు సెలెక్ట్.. వీరు రిజెక్ట్ అనేస్తున్నారు. నిజానికి ఇది కంటెస్టెంట్స్ కంటే జడ్జీలకు అగ్నిపరీక్షగా మారింది. వాళ్లు ఎందుకు సెలెక్ట్ చేస్తున్నారూ.. ఎందుకు రిజెక్ట్ చేస్తున్నారనేదానికి ఎలాంటి లెక్కలూ లేవు. అంతా మా ఇష్టం అనేశారు. వాళ్ళు ముందే సిద్ధం చేసుకున్న జాబితాలో లేకుంటే.. వద్దు అని పంపించేస్తున్నారు. ఎలాంటి ఓటింగ్ లేదు.

**నర్సయ్యతాత షాక్**

బిగ్ బాస్ అగ్నిపరీక్ష రెండో ఎపిసోడ్‌లో ప్రముఖ ఫోక్ సింగర్, ఎఎన్ఎన్ యాంకర్ నర్సయ్య తాత అలియాస్ నీల నర్సింహ పాల్గొనగా, ఆయనని ఎలిమినేట్ చేసిన తీరుపై పబ్లిక్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. జడ్జిలు నవదీప్, బిందుమాధవి, అభిజిత్ లపైనెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గొర్రెల కాపరిగా బిగ్ బాస్ అగ్నిపరీక్ష స్టేజ్‌పైకి వచ్చిన నర్సయ్య తాత.. తన ఆట పాటలతో మెప్పించాడు. బిగ్ బాస్ హౌస్‌కి ఎందుకు వద్దాం అని అనుకుంటున్నారు? అని అడిగింది బిందు మాధవి. 'నా పాటతోటి ఈ సమాజాన్ని మార్చాలి.. పాటకి ఉన్న శక్తి ఇక్కడితో ఆగిపోకూడదు.. జనంలో చైతన్యం తీసుకుని రావాలి. నా పాట ప్రపంచానికి తెలియాలి.. దానికో ప్లాట్ ఫామ్ కావాలి.. అది బిగ్ బాస్ అయితే బావుంటుందని ఇక్కడికి వచ్చాను' అని అన్నాడు నర్సయ్య తాత. ఆయన చెప్పిందంతా విన్న బిందు మాధవి.. 'మీరు హౌస్‌లో ఉండగలరో లేదో అని డౌట్ ఉంది అంటూ రెడ్ ఇచ్చి రిజెక్ట్ చేసింది. దాంతో నర్సయ్య తాత... అమ్మా మీరు ఏ టాస్క్‌లు పెట్టినా ఆడతా.. దయచేసి తీసేయొద్దు' అని వేడుకున్నాడు. దాంతో సూపర్ జడ్జీగా ఉన్న శ్రీముఖి.. 'టాస్క్‌లు పెడితే ఆడతానన్నారు కదా.. ఆ రోప్‌కివెళ్లి వేలాడుతూ మాట్లాడు' అని అన్నది. దాంతో నర్సయ్య తాత.. వయసుతో సంబంధం లేకుండా.. వెళ్లి ఆ రోప్‌కి వేలాడుతూ ఉన్నాడు. 'పాటలు పాడతారని హౌస్‌లోకి పంపించడం కరెక్ట్ కాదు' అని నవదీప్ కూడా రెడ్ కార్డ్ ఇస్తే.. అభిజిత్ కూడా రెడ్ కార్డ్ ఇచ్చేసి మీరు ఈ హౌస్‌కి సెట్ కారు అని అన్నాడు. దాంతో నర్సయ్య తాత రెండో మాట మాట్లాడకుండా అక్కడ నుంచి వెళ్లిపోయాడు.

**ప్రగతి భవన్‌ని తాకిన నర్సయ్య తాత పాట**

యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం లక్ష్మాపురానికి చెందిన నర్సయ్య తాతా అసలు పేరు నీల నర్సింహ. తన తండ్రి వారసత్వంగా గొర్రెల కాపరి అయిన నర్సయ్య తాత అప్పట్లోనే పదో తరగతి వరకూ చదువుకున్నాడు. సాహిత్యంపై మంచి పట్టున్న నర్సయ్య తాత.. పాటలు రాయడం, పాడటం ద్వారా ఫోక్ సాంగ్స్‌తో తన గొంతు వినిపించాడు. తాను గొర్రెల కాపరి అయినా కూడా.. అద్భుతమైన సాహిత్యంతో పాట రాసి పాడటంలో మహా దిట్ట నర్సయ్య తాత. ప్రపంచ తెలుగు మహాసభల్లోనూ తన ప్రతిభ చూపించారు నర్సయ్య తాత. తన పాట ప్రగతిభవన్ కోటలు దాటడంతో..సీఎం కేసీఆర్ మన్ననలు పొందారు నర్సయ్య తాత. స్వయంగా ప్రగతి భవన్‌కి వెళ్లి కేసీఆర్‌ని కలిసి.. ఆయనతో కలిసి భోజనం చేసి వచ్చారు నర్సయ్య తాత. ప్రముఖ న్యూస్ ఛానల్‌లో యాంకర్‌గా అవతారం ఎత్తిన నర్సయ్య తాత.. గత ఆరేడేళ్లుగా వివిధ కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు.ప్రస్తుతం ప్రముఖ న్యూస్ ఛానల్ఎ ఎన్ఎన్ తెలుగులో యాంకర్ గామార్నింగ్ న్యూస్ చదువుతూ, వర్తమాన రాజకీయాలువిశ్లేషిస్తున్నారు.తన ఇంటర్వ్యూలతో సెలబ్రిటీలను రప్పారప్పా అంటూ వినూత్న ముద్ర వేస్తున్నారు. అన్యాయాలపై పోరాడే గళమయ్యారు. బిగ్ బాస్ అగ్నిపరీక్షకి మిమ్మల్ని ఎంపిక చేయకపోవడంపై మీరేమంటారని అడిగితే.. "మనసుకి ముసుగేసే మాయ మాటల గుణముతోటి వాడితో నీకెందుకురా ఈ రణము. బిగ్ బాస్ షోలో నర్సయ్య తాతని ఆపేయడం అంటే ఓ శక్తిని ఆపేయడమే. నర్సయ్యతాత తెలుగుదనంపై రాసిన పాట తెలుగునాట 20లక్షల మంది ప్రజలు వీక్షించారు. నవదీప్ మత్తులో తోపు అంటూ జడ్జిల మత్తుదింపే ప్రయత్నం చేశారు. బిగ్ బాస్ కంటెస్టెంట్లు, విన్నర్ల కంటే కూడా నర్సయ్యతాతకే డిమాండ్ పెరిగింది. ఆయన ఇంటర్వ్యూల కోసం ప్రతిరోజూ ఐదారు ఛానళ్ళ నుండి ఫోన్లు వస్తున్నాయి. ఇప్పటికి 60 ఛానళ్ళకు ఆయన ఇంటర్వ్యూలిచ్చారు. బిగ్ బాస్ అనుభవాలు, మోసాలు కళ్ళకు కట్టారు. బిగ్ బాస్ బయటికివచ్చి.. మీరు అగ్నిపరీక్ష జడ్జిలకు పెట్టారు అంటూ అభిమానులు అభినందిస్తున్నారు.

### నర్సయ్యతాతకు క్రేజ్

తన ఆటపాటలతో ప్రజలను ఆకట్టుకునే నర్సయ్యతాతకు బిగ్ బాస్ హౌజ్ లో అన్యాయం జరగడంపై నెటిజన్లు నర్సయ్యతాత నీకు అన్యాయం జరిగింది అంటూ మెసేజ్ లు చేశారు. ఈ క్రమంలో నర్సయ్యతాత బిగ్ బాస్ ప్రోమోలు మాటీవీ, హాట్ స్టార్ లో హైలెట్ కావడం, నెటిజన్ల స్పందన వెరసి.. ఆయన క్రేజ్ వచ్చింది. దీంతో ఏకంగా 50కు పైగా ఛానళ్ళు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ఆయన ఇంటర్వ్యూలను వివిద వేదికల్లో పదికోట్లకు పైగా వీక్షించారు. బిగ్ బాస్ లో వాళ్ళు తప్పచేశారు కానీ.. ఈ ఇంటర్వ్యూలతో ఆ ముగ్గురు కోతిబ్యాచ్ ను ఎండగట్టి ఎఎన్ఎన్ నర్సయ్య తాత ఎదురులేని తాతగా నెట్టింట బిగ్ బాస్ అయ్యాడంటూ నెటిజన్లు మెచ్చుకుంటున్నారు.

### అవకాశం ఎక్కడ ఇచ్చారంటూ నెటిజన్ల ఫైర్

అయితే నర్సయ్యతాత సెట్ అవుతాడా లేదా? అన్నది తెలియాలంటే.. ముందు అతనికి ఓ అవకాశం ఇచ్చి చూడాలి కదా.. అదే అవకాశం మిగిలిన వాళ్లకి ఇచ్చారు కదా.. కానీ నర్సయ్య తాత విషయంలో మాత్రం జడ్జీలు తప్పడు నిర్ణయం తీసుకున్నారని నెటిజన్లు, ప్రేక్షకులు తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. రోప్‌కి వేలాడదీసి.. అతను టాస్క్ కంప్లీట్ చేసిన తరువాత కూడా అకారణంగా బయటకు పంపడం అయితే నర్సయ్య తాతకి అన్యాయం జరిగినట్టే అంటూ వేలాదిగా ఆయనకు మెసేజ్ లు పెట్టారు.



# కొడవటంచ దేవాలయంలో రూ 12.15 కోట్లతో అభివృద్ధి పనులు

**కొడవటంచ ఆలయ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి**

**సీఎం రేవంత్ రెడ్డి చే అభివృద్ధి పనుల ప్రారంభం.. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని కొడవటంచ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులకు, గుత్తేదార్లకు సూచించారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం కొడవటంచ గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోని వేడుకల మందిరంలో ఆలయ చైర్మన్, భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్, దేవాదాయశాఖ, పీఆర్, ఆర్ అండ్ బీ, టూరిజం, మిషన్ భగీరథ, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈఈలు, డీఈలు, ఏఈలు మరియు రేగొండ ఎమ్మార్వో, ఎంపీడీవో, గుత్తేదారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సమీక్షా సమావేశంనకు ముందు ఎమ్మెల్యే బాలాలయంలో స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు స్వామి వారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం జరిగిన సమీక్షా సమావేశంలో ఆలయంలో జరుగుతున్న వివిధ పనుల పురోగతిపై అధికారులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. గర్భగుడి, అన్నదాన సత్రాలు, క్యూలైన్లు, విమాన గోపురం, అర్ధమండపం, ఆర్చి తదితర పనులపై రివ్యూలో చర్చ జరిపారు. మూడు నాలుగు నెలల్లోపు అన్ని పనులు పూర్తయితే ఆలయ పున:ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. దాదాపు వంద ఏళ్ల కిందట స్వామివారికి ఆలయాన్ని నిర్మించారని, ఆలయాన్ని పట్టించుకునే నాథులు లేక ఇన్నాళ్లు నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రజా ప్రభుత్వం



ఏర్పడిన వెంటనే రూ.12.15 కోట్లతో ఆలయంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. విమాన గోపురం అర్థ మండపం, మహా మండపం పునర్నిర్మాణానికి రూ.3.77 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అద్దాల మండపం కోసం రూ.5 లక్షలు, అల్వార్ నిలయానికి రూ.1.10 లక్షలు, పాకశాల భవనానికి రూ.7.5 లక్షలు, క్యూలైన్లకు రూ.30 లక్షలు, అన్నదాన సత్రానికి రూ.40 లక్షలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీకి రూ.15 లక్షలు కేటాయించారు. భక్తుల బస కోసం రూ.5.5 లక్షలు, రూ.50 లక్షలతో చుట్టూ కాంపౌండ్, తాగునీటి ట్యాంక్ కోసం రూ.30 లక్షలు, ఈవో, ఇతర అధికారుల ఆఫీస్ కోసం రూ.50 లక్షలు, అర్చకుల వసతి గృహాలకు రూ.50 లక్షలతో ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. గణపురం మండలం బుద్దారం గ్రామం నుండి కొడవటంచ గ్రామం వరకు నిర్మాణంలో ఉన్న రెండు వరుసల రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆ శాఖ అధికారులకు సూచించారు. రేగొండ పోలీస్ స్టేషన్ వద్ద అసంపూర్తిగా ఉన్న ఆర్చి పనులు పూర్తయ్యాయని, త్వరలోనే ఆర్చిని ప్రారంభించబోతున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.

# జాతీయ లోక్ అదాలత్ పోస్టర్ ఆవిష్కరించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి

**జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కృషి చేయాలి**

**న్యాయవాదులకు సూచనలు చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్.రమేష్ బాబు**

**భూపాలపల్లి, మహా :** జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాలానుసారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ జయశంకర్ భూపాలపల్లి ఆధ్వర్యంలో సెప్టెంబర్, 13 వ తేదీన శనివారం రోజున జాతీయ లోక్ అదాలత్ ను నిర్వహించడం జరుగుతుందని, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ మరియు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గౌరవనీయులు శ్రీ సి.హెచ్.రమేష్ బాబు గారు తెలిపారు. గురువారం న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవనీయులు జడ్జి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ లో రాజీపడదగు క్రిమినల్, సివిల్, వివాహ /కుటుంబ తగాదా కేసులు, మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసులు, చెక్ బౌన్స్ కేసులను మరియు రాజీ పడదగు ఇతర కేసులు పరిష్కరించుటకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కోర్టులలో పెండింగ్ లో ఉన్న తమ తమ కేసులను అధిక



సంఖ్యలో పరిష్కరించుకొని లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని కోరారు. కోర్టులలో లేని కేసులను ప్రీ లిటిగేషన్ ద్వారా న్యాయసేవాధికార సంస్థ లో పరిష్కరించుకోవాలని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకుని, ఎక్కువ కేసులు పరిష్కరించుటకు న్యాయవాదులు కృషికి చేయాలనీ వారు సూచించారు. ఈ సందర్భంగా జాతీయ లోక్ అదాలత్ పోస్టర్ ఆవిష్కరణ చేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జి ఏ.నాగ రాజ్ , ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ , అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి. అఖిల , అడ్వొకేట్స్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి. శ్రావణ్ రావు, పోక్సో కోర్టు స్పెషల్ పి.పి. ఎన్. విష్ణువర్ధన్ రావు, సీనియర్ న్యాయవాదులు పి.ఆనంద రావు, సంగేమ్ రవీందర్, ఎం.రాజ్ కుమార్, జి. ప్రియాంక, ఎం.రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఫోటోగ్రాఫర్‌కు ఘన సన్మానం

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి పట్టణానికి చెందిన ఉత్తమ ఫోటో గ్రఫీ లో ఉత్తమ స్థానం పాల కుర్తి మధు ను ఘనంగా సన్మానం చేశారు. సుభాష్ కాలనీ 17 వార్డు లో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ స్థాయిలో ఫోటోగ్రఫీలో అవార్డుకు ఎంపికయ్యారు. ముఖ్య అధితులుగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బేతోజు వజ్ర మణి భరత్ కుమార్ చారి మహిళా బృందం,వరసిద్ధి వినాయక కమిటీ దాసరి బ్రహ్మ రెడ్డి, వంగళ మోహన చారి, కొండపాక రాజేష్,శివ కుమార్, కట్ట నర్సింహ చారి, చిలుముల శ్రీనివాస్, పుల్యాల తిరుపతి, అంబటి భూమయ్య, చెన్నావేన ఓదెలు, చర్ల రమేష్, సోమనవేన తిరుపతి, కృష్ణ మూర్తి, యాత్ నాయకులు భూక్యా శ్రీరామ్ పాల్గొన్నారు.

# నిమజ్జనం వేళ ట్రై సిటీలో ట్రాఫిక్ ఆంక్షలు

**వరంగల్ హన్మకొండ మహా;** నేడు నిమజ్జనం సందర్భంగా వరంగల్, హన్మకొండ, కాజీపేట ట్రైసిటీ పరిధిలో గురువారం నుంచి పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గణపతుల శోభాయాత్ర, విగ్రహాల తరలింపు సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా ఈ చర్యలు తీసుకున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 5 మధ్యాహ్నం 12 గంటల నుంచి సెప్టెంబర్ 7 మధ్యాహ్నం 1 గంట వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి. ప్రజలు ఈ మార్పులను గమనించి, పోలీసులకు సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

**భారీ వాహనాలకు ప్రత్యేక మార్గాలు**

ములుగు భూపాలపల్లి నుండి హైదరాబాద్: ఈ వాహనాలు ఆరెపల్లి వద్ద ఔటర్ రింగ్ రోడ్డు మీదుగా ప్రయాణించాలి. భూపాలపల్లి పరకాల నుండి ఖమ్మం: ఈ వాహనాలు ఆరెపల్లి వద్ద ఓఆర్ఆర్ మీదుగా, కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నేలు క్రాస్ రోడ్ మీదుగా ఖమ్మం రోడ్డులోకి వెళ్ళాలి. కరీంనగర్ నుండి ఖమ్మం: చింతగట్టు వద్ద ఓఆర్ఆర్ మీదికి వచ్చి, యు టర్న్ తీసుకొని కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నేలు క్రాస్ రోడ్ మీదుగా ఖమ్మం రోడ్డుకు వెళ్ళాలి. ఖమ్మం నుండి కరీంనగర్ / హైదరాబాద్: పున్నేలు క్రాస్ రోడ్, ఐనవోలు ఆర్చ్, వెంకటాపురం, కరుణాపురం మీదుగా వెళ్ళాలి. హైదరాబాద్ నుండి ఖమ్మం: కరుణాపురం, వెంకటాపురం, ఐనవోలు, పున్నేలు క్రాస్ రోడ్ మీదుగా ప్రయాణించాలి. హైదరాబాద్ నుండి నర్సంపేట: కరుణాపురం నుండి ఓఆర్ఆర్ మీదికి వచ్చి ఆరెపల్లి వద్ద దిగి, కొత్తపేట, రెడ్డిపాలెం, జాన్పీరిలు, గొర్రెకుంట మీదుగా వెళ్లాలి. నర్సంపేట నుండి హైదరాబాద్: గొర్రెకుంట, జాన్పీరిలు, రెడ్డిపాలెం, కొత్తపేట, ఓఆర్ఆర్ మీదుగా వెళ్ళాలి. భారీ వాహనాలకు నగరం లోపలికి ప్రవేశం లేదని నిమజ్జనం సమయంలో ఎలాంటి భారీ వాహనాలను నగరం లోపలికి అనుమతించరని స్పష్టం చేశారు. బస్సులు, ఇతర వాహనాల ప్రయాణ మార్గాలు ములుగు పరకాల నుండి వచ్చే బస్సులు: పెద్దమ్మగడ్డ, కెయూసీ, సీపీవో, అంబేద్కర్ సెంటర్, ఏషియన్ శ్రీదేవి మాల్ మీదుగా బస్టాండ్‌కు చేరుకోవాలి. హన్మకొండ నుండి ములుగు / కరీంనగర్ వెళ్లే బస్సులు: ఏషియన్ శ్రీదేవి మాల్, అంబేద్కర్ సెంటర్, సీపీవో ద్వారా కెయూసీ జంక్షన్ మీదుగా వెళ్ళాలి హన్మకొండ నుండి నర్సంపేట, ఖమ్మం వైపు వెళ్లే బస్సులు: బాలసముద్రం, అదాలత్, హంటర్ రోడ్ మీదుగా ప్రయాణించాలి.వరంగల్ నుండి హన్మకొండకు వచ్చే బస్సులు: చింతల్ బ్రిడ్జి, రంగశాయిపేట్, నాయుడు పెట్రోల్ పంప్ సెంటర్, ఉర్సుగుట్ట, అదాలత్, బాలసముద్రం రోడ్ మీదుగా చేరుకోవాలి కాజీపేట నుండి వరంగల్ వెళ్లే చిన్న వాహనాలు: ఫాతిమా జంక్షన్, వడ్డేపల్లి చర్చి, కెయూసీ జంక్షన్, పెద్దమ్మగడ్డ, ములుగు రోడ్డు, ఎంజీఎం, జెమినీ, పోతన జంక్షన్, అండర్ బ్రిడ్జి, హెడ్ పోస్టాఫీసు, వరంగల్ బస్టాండ్, వెంకట్రామ మీదుగా వెళ్ళాలి. తిరిగి అదే మార్గంలో వెళ్ళాలి.

**నిమజ్జన వాహనాలకు సూచనలు**

సిద్దేశ్వర గుండం నిమజ్జనం: ఇక్కడ నిమజ్జనం చేసిన వాహనాలు శాయంపేట వైపు వెళ్ళే రోడ్డు ద్వారా బయలుదేరాలి. శాయంపేట వైపు నుండి వచ్చే వాహనాలు: హంటర్ రోడ్, అదాలత్, హన్మకొండ చౌరస్తా మీదుగా ప్రయాణించాలి. చిన్నవడ్డేపల్లి చెరువు నిమజ్జనం: ఇక్కడ నిమజ్జనం చేసిన వాహనాలు ఏనుమాముల రోడ్ నుండి నర్సంపేట రోడ్ వైపునకు వెళ్ళాలి. బంధం చెరువు: ఎక్సైజ్ కాలనీ, రెవెన్యూ కాలనీ, వడ్డేపల్లి ప్రాంతాల నుండి వచ్చే విగ్రహాలను బంధం చెరువులో నిమజ్జనం చేయాలి. శోభాయాత్ర జరిగే మార్గాల్లో, నిమజ్జనం చేసే ప్రదేశాల వద్ద వాహనాలను నిలప వద్దని పోలీసులు ప్రజలకు సూచించారు.



# జీఎస్టీ తగ్గింపు పై హర్షం వ్యక్తం చేసిన బీజేపీ శ్రేణులు

**ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం**

**వరంగల్ మహా;** దేశ ప్రజల సంక్షేమమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు జీఎస్టీ తగ్గింపు చేసిన ప్రధాని మోదీ నిర్ణయానికి బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, సీనియర్ నేతలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజెపి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ నాయకులు, కార్యకర్తల తో కలిసి వరంగల్ చౌరస్తాలో మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా భారత ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు సాగుతున్నారని, ప్రజల పై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు జిఎస్టి ధరలను భారీగా తగ్గించడం హర్షనీయమని వరంగల్ బిజెపి జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. దేశంలోని ప్రజల ఆరోగ్య భద్రత, మధ్యతరగతి కుటుంబాలకు అన్ని విధాలా లబ్ది చేర్చేల ప్రధ్యానత మోదీ, ఆర్థిక శాఖ మాత్యులు నిర్మల సీతారామన్ జీఎస్టీ వారీగా తగ్గించడాన్నే స్వాగతిస్తూ గురువారం కేంద్రానికి కృతజ్ఞతగా వరంగల్లో బిజెపి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ కు పాలాభిషేకం చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌షా, ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు బన్న ప్రభాకర్, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బైరి మురళీకృష్ణ, గోగికార్ అనిల్, బిజెపి సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరి శంకర్, జిల్లా ఉపాధ్యక్షులు ఏరుకుల రఘునారెడ్డి, జిల్లా కోశాధికారి కూచన క్రాంతి కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు పోలేపాక మార్టిన్ లూథర్, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు బైరి నాగరాజు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఎర్రగొల్ల భరత్ వీర్, పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రి సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

**నర్సంపేట ఎమ్మెల్యే, వరంగల్ జిల్లా కలెక్టర్**

**వరంగల్ మహా;** వరంగల్ జిల్లా నర్సంపేట లోని ప్రభుత్వ ఆసుపత్రిలో నూతన సిటీ స్కానింగ్ మిషన్ సేవలను గురువారం కలెక్టర్ డాక్టర్ సత్య శారద తో కలసి నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిటీ స్కాన్ సేవలను నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మాధవ రెడ్డి కోరారు. మన రాష్ట్ర ప్రభుత్వం 10 లక్షల ఆరోగ్యశ్రీ పథకం అందిస్తుందని, ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఎం హెచ్ ఓ డాక్టర్ సాంబశివ



రావు, ఆర్డీవో ఉమారాణి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్లు మోహన్ దాస్, కిషన్, మార్కెట్ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ప్రభుత్వ డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# లారీలో ఆగిన డ్రైవర్ గుండె..

**మానవత్వంతో స్పందించిన వేలేరు ఎస్ఐ**





**వరంగల్ మహా;** నల్లగొండ జిల్లా దామెర చర్ల ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ తన లారీలో సిమెంట్ బస్తాలను స్థానిక వేలేరు మండలంలోని పిసర గ్రామంలో అన్లోడ్ చేసి వస్తున్న క్రమంలో లారీ నడుపుతున్న సమయంలోనే మల్లి కూడుర్ల గ్రామం వద్ద సదరు లారీ డ్రైవర్ శ్రీనివాస్ కు గుండెపోటు తో లారీలోనే మరణించాడు. సమాచారం అందుకున్న వేలేరు ఎస్ఐ సురేష్ కుమార్ తన సిబ్బందితో కలిసి వెళ్లి లారీలో విగత జీవిగా పడి ఉన్న శ్రీనివాస్ మృతదేహాన్ని తన సిబ్బంది స్థానికుల సహాయంతో లారీ నుండి బయటకు తీసి డీసీఎం వ్యాన్ లోకి ఎక్కించారు. వేంటనే మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించి డ్రైవర్ మృతదేహాన్ని యం జి యం కు తరలించారు. ఈ సంఘటన పై వేలేరు ఎస్సై సురేష్ కుమార్ వేగంగా స్పందించిన తీరు మృతదేహాన్ని లారీ నుండి వ్యాన్ లోకి ఎక్కిచడంలో ఎస్ఐ యే స్వయంగా పాల్గొనడం పట్ల స్థానికుల హర్షం వ్యక్తంచేశారు.

# భూపాలపల్లి జిల్లాలో 107 మంది గ్రామ పాలనాధికారుల నియామకం

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి జిల్లా నుండి గ్రామ పాలన అధికారులుగా ఎంపికైన అభ్యర్థులు సీఎం చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు స్వీకరించేందుకు హైదరాబాద్ వెళ్ళడానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.గురువారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా నుండి మొత్తం 107 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని, వారందరూ శుక్రవారం హైదరాబాద్ వెళ్లనున్నట్లు తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయం నుండి ఉదయం 8 గంటలకు ప్రత్యేకంగా 2 బస్సులు హైదరాబాద్ వెళ్లుటకు సిద్ధంగా ఉంటాయని తెలిపారు. ప్రతి బస్సులో పర్యవేక్షణకు లైజన్ అధికారులను పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. అభ్యర్థులు సకాలంలో ఐడిఓసి కార్యాలయానికి చేరుకోవడానికి ముందస్తు సమాచారం అందజేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. హైదరాబాద్ హైటెక్స్ లో సీఎం అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. తిరిగి ఇంటికి క్షేమంగా చేరే వరకు జాగ్రత్తలు పాటించాలని అధికారులను ఆదేశించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, తదితర అధికారు లు పాల్గొన్నారు.

**పెద్దగుట్టపై ట్రెక్కింగ్ చేసిన జిల్లా కలెక్టర్, ఎస్పీ**

కాటారం మండలంలోని ప్రతాపగిరి పంచాయతీ పరిధిలోగల పెద్ద గుట్టపై గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా ఎస్పీ కిరణ్ ఖరేలు ట్రెక్కింగ్ చేశారు. గొంతెమ్మ గుట్టకు పక్కనే గల పెద్దగుట్టపై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ట్రెక్కింగ్ చేశారు. చీకటి పడడంతో మధ్యనుండే తిరుగు ప్రయాణమయ్యారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డిఎఫ్ ఓ నవీన్ రెడ్డి, డిఎస్పి సూర్యనారాయణ,ఎఫ్ఆర్ఓ సురేందర్ పాల్గొన్నారు.

**వినాయక నిమజ్జనంలో జాగ్రత్తలు పాటించాలి**

వినాయక నిమజ్జనంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు.5వ తేదీన జరుగనున్న వినాయక నిమజ్జన కార్యక్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం అధికారులతో



టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నిమజ్జనం కార్యక్రమంలో ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. 9 రోజుల పాటు ప్రజలు ఎంతో భక్తిశ్రద్ధలతో అంగరంగ వైభవంగా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకున్నారని అన్నారు. నిమజ్జన కార్యక్రమంలో ప్రజలందరూ జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. వినాయక నిమజ్జనం వేళ నిర్వాహకులు, భక్తులు తగిన జాగ్రత్తలు పాటించాలని అన్నారు. నిమజ్జనం చేసేవారు వినాయకుడిని వాహనంలో ఎక్కించేటప్పుడు, నిమజ్జనం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని లేనిచో ప్రమాదాలు జరగడానికి అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. వినాయక నిమజ్జన సమయంలో మహిళలు, వృద్ధులు, చిన్న పిల్లలు చెరువు వద్ద జాగ్రత్తలు వహించి దూరంగా ఉండాలని, టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు వహించాలని, విగ్రహాలు విద్యుత్ కు తాకకుండా జాగ్రత్తలు వహించాలని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆయన తెలియజేశారు. నిర్దేశించిన ప్రాంతంలో మాత్రమే విగ్రహాలు నిమజ్జనం చేయాలన్నారు. నిమజ్జనానికి చిన్నారులను తీసుకెళ్లొద్దని, పరిమిత సంఖ్యలో మాత్రమే సంఖ్యలో అనుమతించాలని, మద్యం సేవించి వెళ్లరాదని సూచించారు. సరదా మాటున ప్రమాదాలకు గురికావొద్దని అది తీరని బాధను మిగుల్చుతుందని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.



# భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ కిరణ్ ఖరే వినాయకుడి పూజ

**భూపాలపల్లి, మహా :** భూపాలపల్లి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలో గురువారం గణేశుడికి ఎస్పీ కిరణ్ ఖరే పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో భూపాలపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది, కుటుంబ సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాల తో జిల్లాలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ఇలాంటి పండుగలు పోలీసు సిబ్బందికి ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని కలిగించడంతో పాటు సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో డిఎస్పి సంపత్ రావు, సిఐ నరేష్, ఎస్ఐలు, సిబ్బంది అందరూ పాల్గొని పూజలో భాగస్వాములయ్యారు.

# అంతర్జాతీయంగా టస్సర్ పట్టు వస్త్రాలు విక్రయానికి ఏర్పాట్లు

**భూపాలపల్లి,మహా :** టస్సార్ పట్టు వస్త్రాలు వ్యాపారాల నిర్వహణకు చర్యలు తీసుకుంటామని సాన్ ఫ్రాన్సిస్కో, బ్రునై దౌత్య కార్యాలయాల అధికారులు శ్రీకర్ కె రెడ్డి, రాము అబ్బగాని తెలిపారు. మహాదేవపూర్ మండలం, టస్సార్ కాలనీలో పట్టు వస్త్రాలు నేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. హైదరాబాద్ శిల్పారామంలో పట్టు వస్త్రాలు విక్రయానికి అనువుగా స్టాల్‌ను ఏర్పాటు చేయించినట్లు కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. పట్టు వస్త్రాలను ఆన్లైన్ ద్వారా, ఇక్కడ నేస్తున్న పట్టు వస్త్రాలను టెస్కో ద్వారా విక్రయాలకు ఆవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. పట్టు గుడ్లు నుండి దారం తీస్తున్న తీరును, వస్త్రాలు నేస్తున్న విధానాన్ని గొర్రె బాబు ఎంతో ఆసక్తిగా వీక్షించి అభినందించారు. వ్యాపారం ఎలా ఉంటుందని గొర్రె బాబును అడిగి తెలుసుకున్నారు. పట్టు వస్త్రాలకు మంచి డిమాండ్ ఉన్నదని అన్ని సమస్యలు అదిగమిస్తూ అవకాశాలను అందిపుచ్చుకుని వ్యాపార వేత్తలుగా ఎదగాలని వారు ఆకాంక్షించారు.

**వర్షా లతో దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేయాలి కలెక్టర్ రాహుల్ శర్మ**

వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు తక్షణమే చేపట్టి ప్రజలకు ఇబ్బందులు రాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం ఐడిఓసి కార్యాలయం



లో మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులతో వర్షాలు, వరదల కారణంగా కలిగిన నష్టాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు, వరదల వల్ల దెబ్బతిన్న రహదారులు మరమ్మత్తులు చేయాలని ఆదేశించారు. దెబ్బతిన్న వనరుల పునరుద్ధరణకు విభాగాలవారీగా ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో వేగంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.జిల్లాలో వర్షాలు, వరదల ప్రభావం వల్ల నష్టపరిహార పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అంచనా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ శ్వేత,పంచాయతీరాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# సిద్ధాపురం సహకార సంఘం గోదాం వద్ద రైతుల ఆందోళన

**హన్మకొండ మహా;** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలంలోని మల్లారెడ్డి పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాము వద్ద గ్రామస్తులు తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి యూరియా బస్తాల కోసం చెప్పులు లైన్ లో పెట్టి పడిగాపులు కాస్తున్నారు. బుధవారం లారీ లోడులో 260 యూరియా బస్తాలు రాగా అందులో నుండి దాదాపు 150 బస్తాలు రాజకీయంగా పలుకుబడి ఉన్న వారే గుట్టుచప్పుడు కాకుండా తీసుకొని వెళ్లారని పలువురు రైతులు ఆరోపించారు. రైతుకు ఒక్క యూరియా బస్తా ఇస్తామని వ్యవసాయ శాఖ అధికారులు, సొసైటీ అధికారులు చెప్పగానే రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్కో రైతుకు 5 నుండి 6 ఎకరాల భూమి ఉంటే ఒక బస్తా యూరియా ఇవ్వడం ఏంటని రైతులు ప్రశ్నించారు.తమకు ఇచ్చిన కార్డుల ద్వారా పంపిణీ చేయాలని వారు కోరారు. కాగా వచ్చిన బస్తాల ఆధారంగా అందరికీ వచ్చే విధంగా ఒక్కొక్కరికి ఇస్తామని అధికారులు సమాధానం చెప్పడంతో గందరగోళం నెలకొంది.

# కొన్ని ఏళ్లుగా ఆ రోడ్డు గుంతల మయమే

**పట్టించుకోని అర్ &బి.. జిడబ్ల్యుఎంసి అధికారులు**

**వరంగల్ మహా;** ప్రతీ వర్షాకాలంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు ప్రమాదాలు జరుగుతున్నా అర్ &బి.. జిడబ్ల్యుఎంసి అధికారులు పట్టించుకోవడం లేదని నగర ప్రజలు వాపోతున్నారు. కాగా కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక ఊడినట్టుగా ఉంది, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తీరు. నగరంలోని గుంతల రోడ్ల ను పూడ్చడానికి వచ్చిన కార్పొరేషన్ అధికారుల తో కలిసి సిబ్బంది సిమెంట్ కంకర పోసి కొత్త సమస్యలను సృష్టించారు. నిత్యం వాహన దారులతో రద్దీగా ఉండే పోచమ్మ మైదాన్ జంక్షన్ నుండి దేశాయి పేట మీదుగా పైడిపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పై మంచినీటి మెయిన్ పైప్ లైన్ లీకేజీల కారణంగా పదేపదే తవ్వడంతో పెద్ద పెద్ద గుంతలతో రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. దీంతో పాటు కాశిబుగ్గ ప్రధాన రహదారి అలాగే అండర్ బ్రిడ్జి మీదుగా ఖమ్మం వెళ్లే ప్రధాన రహదారి లో ప్రతి సంవత్సరం వర్షాకాలం గుంతలమయం దర్శనమిస్తుంది. ప్రతిరోజు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ప్రయాణిస్తున్నా పట్టించుకునే పరిస్థితి మాత్రం లేదు. ప్రజల ఫిర్యాదుల మేరకు కార్పొరేషన్ అధికారులు తూతూ మంత్రంగా గుంతలు పూడ్చి చేతులు దులిపేసు కుంటున్నారు. గుంతలు పూడ్చిన ప్రభుత్వ అధికారులు మధ్యలోనే వదిలేసి కొత్త సమస్యను పెంచుతున్నారని అధికారులు ఏ పని చేసినా పనితీరు అంతంత మాత్రంగా ఉంటుందని మరోసారి నిరూపించుకున్నారు. గుంతల సమస్యను చూడడం ఇష్టం లేని స్థానికులు వాటిని పూడ్చేందుకు స్వతహాగా తట్టా పారాకు పని చెప్పే పరిస్థితులు నెలకొన్నాయని తెలుస్తోంది.



### విద్యారంగ వృద్ధికి ప్రభుత్వంపై
# ప్రత్యేక దృష్టి సారిస్తోంది
## మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**తాండూర్ /మంచిర్యాల, మహా :** ప్రభుత్వ విద్యాలయాలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు. గురువారం తాండూర్ మండలం తంగళ్ళపల్లి గ్రామంలోని గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో షెడ్యూల్డ్ తెగల సంక్షేమ వసతి గృహ ఏర్పాటు కొరకు మండల తహసిల్దార్ జ్యోత్స్న తో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య వ్యవస్థ అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం సకల సౌకర్యాలు, అర్హతలు కలిగిన ఉపాధ్యాయులు, నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు చేపడుతుందని వివరించారు. అనంతరం తాండూర్ మండల కేంద్రంలో వినాయక నిమజ్జనానికి పెద్ద చెరువు ప్రాంతంలో జరుగుతున్న ఏర్పాట్లను రామగుండం కమిషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డి.సి.పి. ఎ.భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ లతో కలిసి పరిశీలించారు. వినాయక శోభాయాత్ర అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ క్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు శాఖ బందోబస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిమజ్జనం ప్రాంతంలో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. తాండూర్ మండల కేంద్రంలోని ఐ.బి. ప్రాంతంలో ఏర్పాటు చేసిన శ్రీ గణేష్ మండలిని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నిమజ్జన కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, నిమజ్జన ప్రాంతంలో లైట్లు, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. మండలంలో ఏర్పాటు చేసిన వినాయక మండళ్లు రిజిస్ట్రేషన్ అయిన ప్రకారం ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులకు తావు లేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి సంస్థ సిఎండి బలరామ్ మరిన్ని అవార్డులు సాధించాలి
## సింగరేణి సంస్థకు 4 జాతీయస్థాయి ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులు
## కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి




**మంచిర్యాల, మహా :** సింగరేణి కాలరీస్ కంపెనీ సిఎండి ఎన్ బలరామ్ భవిష్యత్తులో మరిన్ని అవార్డులు అందుకోవాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. పర్యావరణ హిత చర్యలు, సంక్షేమం, సౌకర్యాల కల్పనలో ఉత్తమ కంపెనీగా ఉన్న సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరానికి జాతీయస్థాయిలో 4 బొగ్గు గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ను సాధించి తన ప్రతిభను మరోసారి చాటుకుంది. ఈ సందర్భంగా గురువారం ముంబయిలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై సింగరేణి సంస్థ ఛైర్మన్ కు అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ ప్రతిష్టాత్మక ఫైవ్ స్టార్ రేటింగ్ అవార్డులను అందుకున్న గనులలో రామగుండం 3 ఏరియాకి చెందిన ఆర్.జి.ఓ.సి 1 ఎక్స్‌టెన్షన్, ఇల్లందు ఏరియాకి చెందిన జే.కే.5 ఓసి, భూగర్భగనుల్లో శ్రీరాంపూర్ ఏరియాకి చెందిన ఆర్కే 6 గని , ఆర్కే న్యూటెక్ గనులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ప్రతీ ఏడాది దేశంలో అత్యుత్తమ గనులకు స్టార్ రేటింగ్ ను ఇస్తూ అత్యుత్తమ స్టార్ రేటు సాధించిన గనుల యాజమాన్యాలను అభినందిస్తూ అవార్డులను అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు వివరించారు. ఈ ప్రక్రియను స్టార్ రేటింగ్ అంటారన్నారు.ఇలా స్టార్ రేటింగ్ ఇవ్వడం కోసం బొగ్గు గని పనితీరు, రక్షణ చర్యలు, నిర్వహణ, అక్కడ గల సౌకర్యాలు, పర్యావరణహిత చర్యలు, కార్మిక సంక్షేమం వంటి 84 అంశాలను పరిగణనలోనికి తీసుకుని మార్కులను కేటాయించడం జరుగుతుంది పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రమాణాలు నెలకొల్పి ఉన్న గనులలో పై 84 అంశాలను కేంద్ర బొగ్గు శాఖ నుండి వచ్చిన పరిశీలక బృందం వారు ప్రత్యక్షంగా పరిశీలించి మూల్యాంకనం జరుపుతారనీ అన్నారు. ప్రాథమిక మూల్యాంకనం తర్వాత వీటి నుండి అత్యుత్తమ గనులను ఎంపిక చేస్తారని తెలిపారు. ఇలా ఎంపిక చేసిన వాటిలో ఇంకా అత్యుత్తమమైన వాటిని మరో కమిటీ ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మొత్తం 100 మార్కుల్లో 91 కన్నా ఎక్కువ మార్కులు సాధించిన గనులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇస్తారని చెప్పారు. ఈ విధంగా సింగరేణి సంస్థలో ఈసారి నాలుగు గనులు ఫైవ్ స్టార్ రేటింగ్ సాధించడం పట్ల ఆయన అభినందించారు. ఈ గనుల నిర్వహణ, పర్యావరణ చర్యలు, సంక్షేమ కార్యక్రమాలు, ఉత్పత్తి సాంకేతికత వంటి అంశాలలో ఉత్తమ ప్రమాణాలు పాటిస్తున్నందు వల్లే ఈ అవార్డులకు ఎంపికైనట్లు వివరించారు. అనంతరం సింగరేణి సంస్థ ఛైర్మన్ ఎండీ బలరామ్ మాట్లాడుతూ సింగరేణి కంపెనీ ఒకవైపు ఉత్పత్తి ఉత్పాదకత మరోవైపు సంక్షేమం వైపు దృష్టిసారిస్తుందని వెల్లడించారు. సింగరేణికి నాలుగు అవార్డులు దక్కడం పట్ల ఆ గని అధికారులకు, కార్మికులకు అభినందనలు తెలిపారు. ఈ నాలుగు గనుడే కాకుండా మరో 14 గనులు 100 కు 80 నుండి 90 మార్కులు సాధించి 4 స్టార్ రేటింగు ను అందుకోవడంతో పాటు 20 గనులకు 3 స్టార్ రేటింగ్ రావడం విశేషమని వెల్లడించారు. గతంలో కొన్ని గనులకు 2 స్టార్ రేటింగ్ లు రావడమే గొప్పగా ఉండేదని అన్నారు. ఈ సారి అన్ని గనులు తమ పనితీరును మెరుగుపరచుకుని 3 స్టార్ రేటింగ్ సాధించడం సింగరేణి సంస్థ ఖ్యాతి భారతదేశ నలుమూలల వ్యాపించిందని సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఘనంగా గురు పూజోత్సవం



**ఆదిలాబాద్ మహా :** సమాజంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో గొప్పదని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని సెప్టెంబర్ 5 న నిర్వహించే గురుపూజోత్సవాన్ని ఒక రోజు ముందుగానే నిర్వహించారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఇంచార్జ్ జిల్లా విద్యా శాఖాధికారి, ఖుష్బూ గుప్తా,డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజరెడ్డి, ట్రైనీ కలెక్టర్ సలోని చాబ్రాలతో కలిసి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి వారికి ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. విద్యార్థుల భవిష్యత్తును రూపొందించడంలో, వారి వ్యక్తిగత అభివృద్ధికి, మంచి పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారన్నారు .దేశాభివృద్ధి లోనూ వారి పాత్ర ఎంతో ముఖ్యమైనదని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ నిస్వార్థ సేవను గుర్తించడానికి గురుపూజోత్సవాన్ని జరుపుకుంటామన్నారు.జిల్లాలో విద్యలో అనేక ఆధునిక మార్పులు తీసుకొచ్చినట్టు తెలిపారు. ఇప్పటికే కొన్ని స్కూళ్లలో ఏఐ విద్యా బోధన మరి కొన్ని స్కూళ్లలో డిజిటల్ కోడ్ కూడా తీసుకురానున్నట్టు చెప్పారు. అలాగే ప్రీ ప్రైమరీ స్కూలింగ్ కూడా కొన్ని స్కూళ్లలో ప్రారంభించినట్టు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు చక్కగా చదువు బోధించి జాతి నిర్మాతలుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

# ఈవిఎంల భద్రతకు పటిష్టమైన చర్యలు
## మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు మంచిర్యాల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ వెల్లడించారు. గురువారం సాధారణ తనిఖీలలో భాగంగా జిల్లాలోని నస్పూర్ లో గల ఈ.వి.ఎం. గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి చంద్రయ్య, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈ.వి.ఎం. గోదాము వద్ద భద్రత సిబ్బందితో పటిష్టమైన చర్యలకు ఆ ప్రాంగణంలో సి. సి. కెమెరాల పర్యవేక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా ఈ పర్యవేక్షణ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రామచందర్, సంబంధిత అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# నిఘా నీడలో భైంసా

**నిర్మల్ మహా:** నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో నిర్వహించే గణేష్ నిమజ్జనానికి పటిష్ట నిఘాను ఏర్పాటుచేసినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిళ అన్నారు. శోభాయాత్ర ఆద్యంతం ప్రశాంతంగా కొనసాగాలని అందుకు తగ్గట్టుగా బందోబస్తును ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఇందులో 1 అడిషనల్ ఎస్పీ, ఇద్దరు ఏఎస్పీలతో పాటు మొత్తం 600 మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. అలాగే భైంసా పట్టణంలో ముందు ఉన్న కెమెరాలకు ఇంకా 100 నుండి 200 సీసీ కెమెరాలను అధికంగా ఏర్పాటుచేసినట్లు వీటిని కమాండ్ కంట్రోల్ తో పాటు, హైదరాబాద్ లోని సీసీసీ కమాండ్ కంట్రోల్ కి అనుసంధానం చేసినట్లు తెలిపారు. వారు కూడా ఇక్కడ జరిగేదంతా పర్యవేక్షిస్తారన్నారు. అదేవిధంగా ప్రధాన కూడళ్ల వద్ద ప్రత్యేక పికెటింగ్ లను ఏర్పాటుచేసినట్లు పూర్తిగా భైంసా పట్టణం పోలీసుల అధీనంలో ఉందన్నారు. గణేష్ నిర్వాహకులు ప్రశాంత వాతావరణంలో నిమజ్జన శోభాయాత్ర నిర్వహించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట నిఘాను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

# మైనార్టీ నాయకుల అన్నదానం



**ఆదిలాబాద్ మహా :** జిల్లాలోని బోథ్ మండల కేంద్రంలోని సర్కార్ గణేష్ మండలి వద్ద మైనార్టీ కి చెందిన షేక్ అబుద్ ఆత్మ డైరెక్టర్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మత సామరస్యాన్ని చాటుకున్నారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ లతో కలిసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోథ్ ప్రాంతానికి ఒక ప్రత్యేకత ఉందని గణేష్ ఉత్సవాలు కానీ బక్రీద్,మొహర్రం, ఇలా ఏ పండగ అయినా అన్ని మతాల ప్రజలం కలిసి చేసుకుంటామని అన్నారు. గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ఆ గణేశుని ఆశీర్వాదం తో బోథ్ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో పాడి పంటలతో ఆనందంగా ఉండాలని కోరుకున్నారు.

# మద్యం మత్తులో టీచర్..



**కొమురం భీం ఆసిఫాబాద్ మహా :** ఉపాధ్యాయులు జాతి నిర్మాతలంటూ ఓ పైపు వారిని కీర్తిస్తూ గురుపూజోత్సవం రోజున సత్కరిస్తుంటే మరికొందరు టీచర్లు మాత్రం ఆ వృత్తికే కళంకం తెస్తున్నారు. ఉపాధ్యాయ దినోత్సవానికి జిల్లా లో కార్యక్రమాలు నిర్వహిస్తున్న వేళ ఓ టీచర్ మాత్రం కడుపు నిండా మందు సేవించి మత్తులో స్కూల్లోనే నిద్రపోయారు. కొమురం భీం అసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలం సుకుడ్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో ఈ ఘన చోటు చేసుకుంది. ఇక్కడి స్కూల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు జే విలాస్ మద్యం తాగి పాఠశాలకు రావడంపై గ్రామస్థులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయగా గతంలోనే ఇతన్ని సస్పెండ్ చేసారు. అయినా తాగి మళ్లీ పాఠశాలకు వచ్చాడని గ్రామస్తులంటున్నారు.

# వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరగాలి
## కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ మహా :** వినాయక నిమజ్జన శోభాయాత్రను ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి లోటుపాట్లు లేకుండా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. గురువారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలోని మున్నూరుకాపు ఫంక్షన్ హాల్‌లో వినాయక నిమజ్జన ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గణేష్ నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖలు అవసరమైన చర్యలు చేపట్టామని తెలిపారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున భక్తులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ, వినాయక నిమజ్జనం ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరగాలని ఆకాంక్షించారు. గడ్డెన్న వాగు పరిసరాల్లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్, ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్, భైంసా సబ్ కలెక్టర్లను సన్మానించారు. అనంతరం పట్టణంలోని పలు మండపాల్లో కలెక్టర్, ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించి సన్మానించారు.అనంతరం తానూరు మండలం బోసి గ్రామంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో జిల్లా కలెక్టర్, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు శాలువాలతో సత్కరించి వినాయకుని చిత్రపటాలను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, ఏఎస్పీ అవినాష్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ షిండే ఆనంద్ రావు పటేల్, గణేష్ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ & పీజీ కళాశాలలో
# ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలు
## సర్వేపల్లి రాధాకృష్ణన్ ను స్మరించుకున్న అధ్యాపకులు, విద్యార్థులు
..ఉపాధ్యాయుడితోనే అభివృద్ధి అని తెలిపిన ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంపల్లి శంకర్



**బెల్లంపల్లి,మహ :** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో గురు వారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కాంప ల్లి శంకర్ తెలిపారు. ముందుగా సర్వే పల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూల మాల వేశారు. దేశ విద్యా వ్యవస్థకు ఆయన అందించిన సేవలను కొనియా డారు. ఆయన జీవించిన కాలంలో ఎక్కువ భాగం దేశం విద్యాభివృద్ధి సాధించాలని ఆకాంక్షతో ముందుకు సాగారని ఈ సందర్భంగా గుర్తు చేసు కున్నారు.దేశానికి మొదటి ఉపరాష్ట్ర పతిగా, రెండవ రాష్ట్రపతిగా సేవలు అందించిన ఘనత అధ్యాపక వర్గం నుంచి సర్వేపల్లి రాధాకృష్ణన్ కు దక్కు తుందని కొనియాడారు.ఆయ నమార్గం లో నడవవలసిన బాధ్యత ప్రతి ఒక్క రిపై ఉందని పేర్కొన్నారు. ..ప్రత్యక్ష బోధనకు ప్రత్యామ్నాయం లేదు..ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు, విద్యార్థులు కూడా మాట్లాడారు. విద్యా వ్యవస్థలో గురు వు పాత్ర గురించి కొనియాడారు.సాంకే తిక పరిజ్ఞానం ఎంత అందుబాటులోకి వచ్చినా తరగతి గదిలో ఉపాధ్యాయు డు ప్రత్యక్షంగా బోధించే తీరుకు ప్రత్యా మ్నాయం లేదని ఓ విద్యార్థి మాట్లాడ డం కార్యక్రమంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రేష్మ, మోహన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ ప్రభుత్వ ధ్యేయం
## గురుకుల పాఠశాలల్లో ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహణ



**బెల్లంపల్లి, మహా:** విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం గురుకుల పాఠశాలల్లో ఏర్పాటు చేస్తున్నారు.ఈ క్రమంలో భాగంగా గురువారం రోజు మంచిర్యాల జిల్లా వైద్య ఆర గ్యశాఖ అధికారిని డాక్టర్ ఎస్ అనిత, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాలతో మహాత్మ పూలే రెసిడెన్షియల్ పాఠశాల మందమర్రిలో మరియు బెల్లంపల్లిలోని మైనారిటీ ఆశ్రమ పాఠశాలలో వైద్య శిబిరం ను అవగాహన సదస్సును ఏర్పాటు మహాత్మ జ్యోతి పూలే రెసిడెన్షియల్ పాఠశాలలో సుమారు 51 మందికి పరీక్షలుచేయడం జరిగింది ఇందులో 8 మందికి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. మలేరియా గానీ డెంగ్యూ గానీ పాజిటివ్ లు నిర్ధా రణ కాలేదు. అదేవిధంగా 14 మందికి చర్మ సంబంధిత అలర్జీకి సంబంధించిన చికిత్సలు చేయగా ముగ్గురిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మందమర్రి కి పంపించి ఐవీ ఫ్లూట్ ద్వారా చికిత్స అందించారు.పాఠశాలలో డ్రైడే తో పాటు కిచెన్ను పరిశీలించి మరియు దోమల మందు పిచికారి చేయించడం జరిగినది. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ రమేష్ డాక్టర్ మానస మరియు ఆర్బి ఎస్ కె వైద్యులు, వైద్య సిబ్బంది ,ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాఠశాలకుసంబంధించిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదే విధంగా మైనారిటీ గురుకులం గర్ల్స్ రెసిడెన్షియల్ పాఠశాల బెల్లంపల్లిలో కూడా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా సుమారు 212 మందికి పరీక్షలు నిర్వహించి ఇందులో 15 మందికి జ్వరాలుగా గుర్తించి ఆర్డి పరీక్షలు చేయడం జరిగినది ఎలాంటి పాజిటివ్ కేసులు నిర్ధారణ కాలేదు. అదే విధంగా చర్మసంబంధిత ఎనిమిదిమంది విద్యార్థులు కంటికి సంబంధించిన ఇద్దరు విద్యార్థినులు ఇతర సమస్యలతో 24 మందిని గుర్తించి వైద్య శిబిరంలో చికి త్సలు అందించారు .ఈ పాఠశాలలో కూడా బ్రెడ్ తో పాటు దోమల మందు పిచికారి చేయించడం జరిగినది, ఈ కార్యక్రమంలో డాక్టర్ సుచరిత తోపాటు ఆర్బీఎస్కే సిబ్బంది పద్మ, డిపిహెచ్ఎన్ మరియు వైద్య సిబ్బంది, ఆశ ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు ఈ రెండు ఆశ్రమ పాఠశాలలో రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు ఎలాంటి సివియర్ కండిషన్స్ తో లేరు. వైద్యాధికారులు మూడు రోజుల పాటు వైద్య శిబిరంలో ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖఅధికారి తెలియజేశారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టుతున్నట్టు బుక్క వెంకటేశ్వర్ జిల్లా మాస్ మీడియా అధికారి తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులందరూ తమ పరిధిలోని రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్యశిబిరంలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు.



# మై హోమ్ భుజా గణేశ్ లడ్డూ
# @రూ. 51,77,777
## మరోసారి రికార్డు సృష్టిస్తూ భారీ ధర
### లడ్డూ దక్కించుకున్న ఇల్లందుకు చెందిన కొండపల్లి గణేశ్

**హైదరాబాద్, మహా:** రాయదుర్గంలోని మై హోమ్ భుజాలో గణేశ్ లడ్డూ భారీ ధర పలికింది. వేలంలో ఇల్లందుకు చెందిన కొండపల్లి గణేశ్ అనే వ్యక్తి రూ. 51,77,777కు దక్కించుకున్నాడు. గతేడాది ఇక్కడ లడ్డూ ధర రూ. 29 లక్షలు పలికింది. అప్పుడు ఇదే గణేశ్ లడ్డూను వేలంపాటలో దక్కించుకున్నారు. 2024లో రూ. 29 లక్షలు పలుకగా, 2023లో 25.50 లక్షలు పలికింది. 2023లో చిరంజీవి గౌడ్ దక్కించుకున్నారు. 2022లో రూ. 20.50 లక్షల ధర పలుకగా, వ్యాపారవేత్త సత్తిబాబు దక్కించుకున్నారు.



## హీరోయిన్ కాకుంటే రాశీ ఖన్నా ఏమయ్యేదో తెలుసా..

# అదే తన డ్రీమ్ అట..!

ప్రస్తుతం టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలుగుతున్నరాశీ ఖన్నాకి సంబంధించిన ఆసక్తికర విషయం నెట్టింట వైరల్ అవుతుంది. నటన అనేది తన గోల్ కాదని, ఐఏఎస్ ఆఫీసర్ కావాలని ఎన్నో కలలు కన్నానని చెప్పకొచ్చింది. చదువులో ఎప్పడూ ముందు వరుసలో నిలిచిన ఈ ఢిల్లీ అమ్మాయి, జీవితంలో టర్నింగ్ పాయింట్స్ గురించి ఊహించలేదు. 1990 నవంబర్ 30న ఢిల్లీలో జన్మించిన రాశి ఖన్నా, చిన్నప్పటి నుంచే పాఠశాలలో టాపర్‌గా నిలిచేది. ఢిల్లీ యూనివర్సిటీలో ఇంగ్లీష్ లిటరేచర్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేసింది. డిగ్రీ చదువుతున్న సమయంలోనే కొంతకాలం అడ్వర్టైజ్మెంట్ ఏజెన్సీ కోసం కాపీ రైటింగ్ కూడా చేసింది. అదే సమయంలో ఐఏఎస్ కావాలన్న స్వప్నాన్ని గుండెల్లో పెట్టుకుని ముందుకు సాగింది. కానీ జీవితంలో ఊహించని మలుపులతో నటన వైపు వచ్చేసింది. డిగ్రీ చదువుతున్న సమయంలోనే మోడలింగ్ అవకాశాలు వచ్చిన రాశి, తక్కువ సమయంలోనే వెండితెరపై అడుగుపెట్టింది. 2013లో సుజిత్ సర్కార్ దర్శకత్వంలో వచ్చిన 'మద్రాస్ కేఫ్' ద్వారా బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది. ఇందులో జాన్ అబ్రహం భార్యగా నటించిన ఈమెను ప్రేక్షకులు గుర్తుపెట్టుకున్నారు. 2014లో నాగశౌర్యతో కలిసి నటించిన 'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది రాశి ఖన్నా. ఆ తర్వాత 'మనమ్', 'తొలిప్రేమ', 'వెంకీ మామ', 'ప్రతిరోజూ పండగే', 'సర్దార్', 'థాంక్యూ' వంటి చిత్రాల్లో నటించి క్లాస్ అండ్ మాస్ ప్రేక్షకుల మన్ననలు పొందింది. ఐఏఎస్ ఆఫీసర్ అవ్వాలన్న కలను పక్కన పెట్టి, ఇప్పుడు ఒక్కో చిత్రానికి కోటికి పైగా పారితోషికం తీసుకుంటున్న రాశి ఖన్నా, తమిళ్, హిందీ ఇండస్ట్రీలలో కూడా తన స్థానాన్ని కల్పించుకుంది. ప్రస్తుతం పవన్ కళ్యాణ్‌తో కలిసి 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో నటిస్తోంది. ఇటీవల పవన్ బర్త్‌డే సందర్భంగా షూటింగ్ సెట్స్‌లో నుంచి ఒక ఫోటో లీక్ చేసి ఫ్యాన్స్‌కి మంచి కిక్ ఇచ్చింది. మొత్తానికి రాశీ ఖన్నా డ్రీమ్ గోల్ చాలా పెద్దదే అని తెలుసుకొని ఫ్యాన్స్ అంతా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

# అల్లు కనకరత్నమ్మ మృతికి ప్రధాని సంతాపం





ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తల్లి కనకరత్నమ్మ(94) మృతి చెందిన సంగతి తెలిసిందే. కొంతకాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమె గత శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు. కనకరత్నమ్మ మృతి పట్ల ధాన మంత్రి నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అల్లు కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. కనకరత్నమ్మ తన కళ్లను దానం చేయడం గొప్ప విషయం అని.. ఒక జీవితానికి వెలుగునిచ్చి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. ఈ కష్ట సమయంలో అల్లు కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అంటూ మోదీ ఓ సందేశాన్ని పంపారు. ప్రధానమంత్రి తెలిపిన సంతాప సందేశానికి అల్లు అరవింద్ కృతజ్ఞతలు తెలిపారు. అల్లు కనకరత్నమ్మ అంత్యక్రియలు శనివారం మధ్యాహ్నం హైదరాబాద్‌లోని కోకాపేటలోని అల్లు కుటుంబ ఫామ్‌హౌస్‌లో జరిగాయి. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవి, అల్లు అర్జున్, రామ్ చరణ్, వెంకటేష్, నాగ చైతన్య, త్రివిక్రమ్ శ్రీనివాస్ తదితర సినీ, రాజకీయ ప్రముఖులు నివాళులు అర్పించారు.

## ఆస్కార్ విన్నింగ్ అవతార్ రీరిలీజ్..

# ఎప్పుడంటే?




"అవతార్: ఫైర్ అండ్ యాష్" కోసం ఎదురుచూస్తున్న ప్రేక్షకులకు 20th Century Studios ఓ గొప్ప బహుమతి ఇవ్వనుంది. జేమ్స్ కామెరూన్ మాస్టర్ పీస్ "అవతార్: ది వే ఆఫ్ వాటర్" అక్టోబర్ 2న భారతీయ థియేటర్స్‌లో ఒక వారంరోజుల పాటు 3D లో రీరిలీజ్ కానుంది. 2022 డిసెంబర్‌లో విడుదలైన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. భారతదేశంలో అత్యధిక వసూళ్లు సాధించిన హాలీవుడ్ సినిమా అనే రికార్డుతో పాటు, ఆస్కార్ అవార్డు (బెస్ట్ అచీవ్‌మెంట్ ఇన్ విజువల్ ఎఫెక్ట్స్) గెలుచుకుంది. ఈ సినిమాలో సామ్ వర్తింగ్టన్, జోయి సాల్డానా ప్రధాన పాత్రల్లో నటించగా, సిగోర్నీ వీవర్, కేట్ విన్స్‌లెట్, స్టీఫెన్ లాంగ్ కీలక పాత్రల్లో కనిపించారు. అవతార్: ది వే ఆఫ్ వాటర్ 3D వర్షన్ ద్వారా పండోరా ప్రపంచాన్ని మరోసారి చుట్టేయండి. "ఈ అవకాశం అస్సలు మిస్ అవ్వకండి. ఈ మనోహరమైన లోకాన్ని ముందే చూసినా, లేదా మొదటిసారి చూడబోతున్నా ఇది మర్చిపోలేని సినిమా అనుభవం అవుతుంది" అని 20th Century Studios ఇండియా ప్రతినిధులు తెలిపారు. "అవతార్: ఫైర్ అండ్ యాష్" విషయానికి వస్తే ఈ మూవీ ఇండియాలో ఈ ఏడాది డిసెంబర్ 19న విడుదల కానుంది.

## అనుష్క కోసం

# ప్రభాస్ ఎంట్రీ..

### ఘాటీ స్పెషల్ గ్లింప్స్



అనుష్క నటించిన ఘాటీ సినిమా కోసం ప్రభాస్ ఎంట్రీ ఇచ్చారు. అనుష్క యాక్షన్ సీన్స్‌కు సంబంధించిన గ్లింప్స్‌ను ఆయన విడుదల చేశారు. స్వీటీ సినిమా ప్రమోషన్ కోసం బాహుబలి ఎంట్రీ ఇవ్వడంతో అభిమానులు ఫుల్ జోష్‌లో ఉన్నారు. దర్శకుడు క్రిష్ తెరకెక్కించిన ఈ యాక్షన్ క్రైమ్ డ్రామా చిత్రం సెప్టెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. యు.వి.క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా ఈ మూవీని నిర్మించాయి. కొన్ని కారణాలవల్ల ఘాటీ సినిమా ప్రమోషన్స్‌కు అనుష్క దూరంగా ఉన్నారు. అయితే, ఫోన్ ద్వారా ఆమె ఈ చిత్రం గురించి కొన్ని విషయాలు పంచుకున్నారు. తాజాగా ఘాటీ కోసం సడెన్‌గా ప్రభాస్ ఎంట్రీ ఇవ్వడంతో మరింత బజ్ క్రియేట్ కానుంది.



## సౌత్ సినిమాలో

# హీరోగా?

తెలుగు హీరోలైన బన్నీ, రామ్‌చరణ్, తారక్.. పానిండియా ప్రేక్షకులకు చేరువయ్యారు. కోలీవుడ్ హీరో ధనుష్ కూడా టాలీవుడ్, బాలీవుడ్‌లలో ఫేమస్. ఇప్పటివరకూ సౌత్ సినిమాపై అంతగా ఆసక్తి చూపించని బాలీవుడ్ హీరోలు సైతం మెల్లమెల్లగా దక్షిణం వైపు చూడ్డం మొదలుపెట్టారు. ఇప్పటికే సల్మాన్‌ఖాన్, ఆమీర్‌ఖాన్ సౌత్‌లో నటించిన విషయం తెలిసిందే. అయితే.. వీరిద్దరూ స్పెషల్ రోల్స్ మాత్రమే చేశారు. బాలీవుడ్‌లో గ్రీక్ గాడ్‌గా పేరెన్నికగన్న హృతిక్ రోషన్ మాత్రం ఇంకో అడుగు ముందుకేసి, ఓ సౌత్ సినిమాలో హీరోగా నటించేందుకు రెడీ అయ్యారనేది లేటెస్ట్ న్యూస్. ప్రతిష్ఠాత్మక హోంబలే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నదట. మైథాలజీ నేపథ్యంలో ఈ సినిమా ఉండనున్నదని, హృతిక్ నటించే తొలి స్ట్రెయిట్ సౌత్ సినిమా ఇదే అవుతుందని ఫిల్మ్ వర్గాల టాక్.




## జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ వేరే లెవెల్..

# తెలుగు హీరోల్లోనే అత్యధిక ధర!

టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ప్రపంచవ్యాప్తంగా ది మ్యాన్ ఆఫ్ మాసెస్‌కు డై హార్డ్ ఫ్యాన్స్ ఉన్నారు. ఆర్‌ఆర్‌ఆర్, దేవర, వార్2 చిత్రాలతో జూనియర్ వరల్డ్ వైడ్‌గా క్రేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఇటీవలే హృతిక్ రోషన్‌తో కలిసి వార్2 చిత్రంలో ప్రేక్షకులను అలరించారు. కూలీతో పోటీపడిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఫర్వాలేదనిపించింది. ఈ సినిమాతో మన యంగ్ టైగర్ బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు. అయితే జూనియర్ ఎన్టీఆర్‌కు మాత్రమే కాదు.. ఆయన ఫోటోకు కూడా ఇంత క్రేజ్ ఉందని అర్థమైంది. బులా రుబీ అనే పెన్సిల్ ఆర్టిస్ట్ జూనియర్ ఎన్టీఆర్ ఫోటోను తన టాలెంట్‌తో ఆవిష్కరించారు. తాజాగా ఈ ఫోటోకు అదిరిపోయే ధర వచ్చింది. ఇప్పటి వరకు ఏ తెలుగు హీరోకు చెందిన పెన్సిల్ ఆర్ట్‌కు ఇంత భారీ ధరకు అమ్ముడవ్వలేదు. తొలిసారి జూనియర్ ఎన్టీఆర్ ఆర్ట్‌కు ఏకంగా రూ.1,45,300 రూపాయలు అమ్ముడైంది. ఈ విషయాన్ని ఆర్టిస్ట్ బులా రూబీ ట్విటర్ ద్వారా షేర్ పంచుకుంది. ఎన్టీఆర్ ఆర్ట్ సరికొత్త చరిత్ర సృష్టించింది.. నా పెన్సిల్ ఆర్ట్ ఇలా చరిత్ర సృష్టిస్తుందని నేను కలలో కూడా ఊహించలేదు. ఈరోజు నా జూనియర్ ఎన్టీఆర్ పెన్సిల్ ఆర్ట్ ఇప్పటివరకు అమ్ముడైన అత్యంత ఖరీదైనది. ఈ ఘనతకు మీ అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా అంటూ ట్విటర్‌లో పోస్ట్ చేసింది. ఇది చూసిన అభిమానులు దట్ ఈజ్ ఎన్టీఆర్ క్రేజ్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. తన టాలెంట్‌తో ఎన్టీఆర్ ఫోటోను ఆవిష్కరించిన బులా రూబీకి అభినందనలు చెబుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com